KSR02B138 C

ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
సెప్టెంబర్ 18, 2016

స్నేహ

ENTERED



ఒక మలుపు



అంతటా యంత్రుడే



బాలీవుడ్ బొమ్మల పలుకులు

'ది జంగిల్ బుక్'లో షేర్ ఖాన్, భల్లు, కా పాత్రలకి ప్రియాంక చోప్రా, ఇర్ఫాన్ ఖాన్, నానాపటేకర్‌లు గొంతునందించారు. హాలీవుడ్ యానిమేషన్ చిత్రాలకి బాలీవుడ్ తారలు డబ్బింగ్ చెప్పే ట్రెండ్ షారుక్‌తోనే ప్రారంభమైంది. హాలీవుడ్ చిత్రం 'ది ఇన్‌క్రెడబుల్స్'కి డబ్బింగ్ వర్షన్ 'సూపర్ హీరో'లో లాజవాబ్ పాత్రకి వాయిస్ ఇచ్చారు బాలీవుడ్ బాద్‌షా. తొలి హిందీ త్రీడి యానిమేషన్ చిత్రం 'జుంబో'లో బుజ్జి ఏనుగులకి అక్షయ్ కుమార్, లారాదత్త వాయిస్ ఇచ్చారు. ఈ చిత్రంలో డింపుల్ కపాడియా, రాజ్‌పాల్ యాదవ్, యువరాజ్ సింగ్, గుల్షన్ గ్రోవర్ వివిధ పాత్రలకి గొంతునిచ్చారు. 'ఢిల్లీ సఫారీ'లో అక్షయ్ ఖన్నా, గోవింద, ఊర్మిళ మంటోడ్కర్, బొమన్ ఇరానీ, సునీల్ శెట్టి వంటి అగ్రతారల గొంతు కామెడీ పాత్రల్లో వినిపిస్తుంది. 'రోడ్ సైడ్ రోమియో'లో లైలా, రోమియో పాత్రలకి తమ గొంతుతో ప్రాణం పోశారు.. కరీనా, సైఫ్ అలీ ఖాన్. 'రామాయణ ది ఎపిక్', 'మహాభారత్'లో విద్యాబాలన్, సన్నీడియోల్, అజయ్ దేవ్‌గణ్‌లతో పాటు అమితాబ్, అమ్రిష్ పురీల బేస్ వాయిస్‌లు ఆ చిత్రాలకి హైలెట్ అయ్యాయి. 'రియో-2'లో బ్లూ, ది జ్యూయెల్ పక్షులకి ఇమ్రాన్ ఖాన్, సోనాక్షి సిన్హా డబ్బింగ్ ఇచ్చారు.







KSR02B138
ENTERED

బైక్ అంబులెన్స్



అదో మారుమూల గ్రామం. ఓ నిండు నెలల గర్భిణికి ఒక్కసారిగా నొప్పులు మొదలయ్యాయి. ఆ వూరికి అంబులెన్స్ రాలేదు. దారి అలా ఉంటుంది. ఆస్పత్రేమో చాలా దూరం. అంతకు ముందు ఊళ్లో ఎవరికైనా సుస్తీ చేస్తే నులక మంచాల్లో వేసి ఆస్పత్రికి తరలించేవాళ్లు. లేదా భూత వైద్యుణ్నో, నాటు మందు వాడి ప్రాణాల మీదకు తెచ్చుకునేవాళ్లు. కొందరికేమో మార్గం మధ్యలోనే ఊపిరి పోయేది. ఊరి పరిస్థితి తెలిసి అమ్మలు ఈ అమ్మాయికి ముందే చెప్పారు ఓ పది రోజుల ముందే ఆస్పత్రికి వెళ్లి చుట్టు పక్కల ఎక్కడో ఓ చోట పడిగాపులు పడదామని. నిండు గర్భిణీ కదా అలా ఎలా ఉండగలుగుతుంది. ఆ బాధేదో ఊళ్లోనే పడదామనుకుంది. మరిప్పుడెలా ఆమెను ఆస్పత్రికి చేర్చడం. నొప్పులందుకున్నాయి.. మంత్రసానిని పిలుచుకురావాల్సిందేనా? అవసరం లేదు. అక్కడో బైక్ అంబులెన్స్ ఉంది. మామూలు బైక్‌కు కొన్ని మార్పుచేర్పులతో ఆ వూరి సమస్యను గట్టెక్కించేస్తోంది.

'త్రీ ఇడియట్స్' చిత్రం చూశారు కదా! అందులో హీరో తన మిత్రుని తండ్రికి సుస్తీ చేస్తే.. అంబులెన్స్ త్వరగా వచ్చే అవకాశం లేకపోతే హడావిడిగా తన బైక్‌పై ఆస్పత్రికి తీసుకెళ్తాడు. అత్యవసర సేవలు ఆలస్యమైతే పరిస్థితి చాలా తీవ్రంగా ఉంటుంది. అంబులెన్స్ రావడానికి సమస్య కాదు కనీసం రోడ్లు కూడా లేని కుగ్రామాల్లో పరిస్థితేంటి? అభివృద్ధికి నోచుకోని చత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాల్లోని మారుమూల ప్రాంతాల్లో అంబులెన్స్‌కు దారిచ్చే అవకాశం కాదు కదా కనీసం అక్కడ కాలి బాటకే ఓ తీరూ తెన్నూ ఉండదు. కొండలు ఎక్కి, దిగి, అడ్డువచ్చిన సెలయేర్లు దాటుకుంటూ వడివడిగా నడవాలి. అత్యవసర వైద్యం మాట పక్కన పెడితే, ప్రథమ చికిత్సకైనా పదుల కిలోమీటర్లు నడిస్తేనే ప్రాథమిక చికిత్స కేంద్రం సౌలభ్యం. అదే ఆరోగ్య పరిస్థితి విషమిస్తే నులక మంచాల్లో పట్టుకెళ్లే ఘటనలు కంటతడి పెట్టిస్తాయి. గర్భవతుల పరిస్థితి అయితే మరీ దారుణం. మంచాన తీసుకెళ్లాలన్నా నలుగురు మనుషులు కావాలి. ఒక్కొక్కసారి వాళ్లూ అందుబాటులో లేకపోవచ్చు. అప్పుడు కర్రకు ఊయలలా కట్టి, అందులో రోగిని కూర్చోబెట్టి, కర్రకు ఇరుపక్కలా ఇద్దరు మనుషులు మోసుకుపోతారు. అదే ఒక్క మనిషి అయితే రోగిని మెడలో కట్టుకుని వేలాడదీసుకుంటూ నడవాల్సిందే. ఈ పరిస్థితులు గమనించే బైక్ అంబులెన్స్ అనే ఆలోచన చేశారు అజయ్ టాక్రూ. ఈ ప్రాజెక్టును సాథి సమాజ్ సేవి సంస్థ రాష్ట్ర ఆరోగ్య శాఖ భాగస్వామ్యంలో యూనిసెఫ్ వైద్య ఆరోగ్యనిపుణులు అజయ్ టాక్రూ 2015లో ప్రారంభించారు. గర్భిణుల మరణాల రేటును తగ్గించడమే ప్రధానంగా ఈ ప్రాజెక్టును ఆరంభించారు. బస్తర్‌లో ఈ వినూత్న ఆలోచన సత్ఫలితాలిస్తోంది. వాహనాలు కూడా దరిచేరలేని మారుమూల ప్రాంతాల్లో కూడా ఈ బైక్ అంబులెన్స్ చొచ్చుకుని వెళ్లగలదు. బస్తర్‌లో ప్రస్తుతం మోటారు సైకిలు అంబులెన్స్ ఒక్కటే ఉంది. కానీ అక్కడి అవసరాలు ఎక్కువ. అత్యవసర సమయాల్లోనూ, మామూలు రోగుల ప్రమాదావస్థల్లోనూ మరిన్ని అంబులెన్స్‌ల తరచూ కావాల్సి వస్తోంది. అందుకే ఈ ప్రాంతంలో మరో పది బైక్ అంబులెన్స్‌లను ఏర్పాటు చేయాలని అజయ్ టాక్రూ ప్రయత్నాలు మొదలుపెట్టారు. నారాయణపూర్‌లో 108 సేవలు అందుబాటులో ఉన్నప్పటికీ, అక్కడి భౌగోళిక పరిస్థితుల రీత్యా దట్టంగా ఉండే అటవీ ప్రాంతాల్లో, కొండవాగు ప్రాంతాల్లోని ఉండే గ్రామాలకు 108 వ్యాన్ చేరుకోలేదు. ఇలాంటి చోట్ల బైక్ అంబులెన్స్ అనేది చాలా కీలకమవుతోంది.



చిన్న మార్పే..

రోగులను తరలించేందుకు ఈ బైక్ అంబులెన్స్‌లకు ఒక పక్క క్యారేజి జతచేసి ఉంటుంది. ఎలా అంటే ఒకప్పుడు స్కూటర్‌లకు, బుల్లెట్‌లకు జతగా మరో కేబిన్ ఉండేది కదా అలా. రోగులకు సౌలభ్యంగా ఉండే విధంగా బైక్ అంబులెన్స్‌ని ఆధునీకరించేందుకు ది నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్) రాయపూర్‌కు చెందిన నిపుణులు మంచి డిజైన్ అందించారు. అటవీ ప్రాంతాల్లో తేలిగ్గా చొచ్చుకెళ్లేలా ఎత్తు పల్లాలను దాటేలా త్వరగా పంచర్లు పడకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. బైక్ పక్కన క్యారేజి లేదా కిట్‌లో రోగిని కూర్చోబెట్టుకుని, తీసుకువెళ్లడానికి అనువుగా ఒక సెటప్‌ని తయారుచేశారు. ఈ ప్రాజెక్టు వలన ఇప్పటికే 300 ప్రాణాలను కాపాడగలిగారు. అందులో 80 శాతం మంది గర్భిణులే కావడం విశేషం. ఈ బైకును నడపడం, ప్రథమ చికిత్స మెళకువలను ఇక్కడ స్థానిక యువకులకు నేర్పించడం ద్వారా మరింత ప్రాణ నష్టాన్ని ఆపగలిగారు. స్థానిక యువకులకు మరింత ప్రాధాన్యతనిస్తూ శిక్షణనిస్తున్నారు. స్థానికులైతే అవసరమైన వేళల్లో మరింత బాధ్యతగా సేవలనందిస్తారు. ఇప్పుడీ బైక్ అంబులెన్స్‌లు తమిళనాడు, కర్నాటక, కేరళ వంటి మిగతా రాష్ట్రాల్లోను సేవలందిస్తున్నాయి. అక్కడి ప్రభుత్వాలు పెద్ద ఎత్తున వీటి సేవల్ని మారుమూల గ్రామాల్లోనే కాక నగరాల్లోను విస్తరించాయి. ఈ ప్రాజెక్ట్ ఆఫ్రికా దేశాల్లోను ఎన్నో ప్రాణాల్ని కాపాడింది. అక్కడ కూడా బైక్ అంబులెన్స్‌ల సేవలు విస్తృతమవుతున్నాయి.

- క.వి.చుసరా

ఇండెక్స్

స్ఫూర్తి..................3
ఆగామీ వేట ఆగింది

స్టార్........4
ఒక మలుపు

కార్టూన్ పంచ్......... 5

వింత లోకం...........10
డిజిటల్ కూతురు

విజేత............... 11
ఆ రెండు పేర్లు

కవిత్వమ్..............14
వీధి బాలుడు

అంతటా యంత్రుడే..

అట్టమీది కథ...6

నా కళ్ళతో - 12
కాలినడకన
ఏడు ఖండాలు

తెలుసా...................15
ఆ ఒక్క రోజు...

కథ 16
నరసింహా సామిల్

తెలుసా...................19
అతి పెద్ద నదీ ద్వీపం

రుచి....................21
పోహా కట్‌లెట్

బాల నేస్తాలు............23
బొమ్మలకో గొడుగు

పద వికాసం.....
....24

అక్షర కిరణాలు

స్నేహ సెప్టెంబర్ 4 సంచికలో అక్షర కిరణాలు శీర్షికన ప్రచురితమైన నిస్వార్థ గురువుల కథనాలు ఆకట్టుకున్నాయి. నిరక్షరాస్య సమాజానికి విజ్ఞాన వెలుగులందిస్తున్న ఉపాధ్యాయులలో స్ఫూర్తిని ద్విగుణీకృతం చేసేలా, అక్షర వితరణలో నిస్వార్థతకి ఊతమిచ్చేలా ఖుర్దీర్, సైకిల్ గురువు ఆదిత్య కుమార్, రోషిణి ముఖర్జీ, సుదాంసు బిస్వాస్, యెన్ ఆర్ జులియేన్ కొనసాగిస్తున్న కృషి నిజంగా అపురూపమే. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భానికి తగిన కథనాలు అందించినందుకు కృతజ్ఞతలు.

- జటావల్లభుల సాయిరాం, కైకరం

సర్ప మిత్రులు

పాము కనిపిస్తే చాలు వణుకు పుడుతుంది. విష సర్పాలనే భయంతో విచక్షణ లేకుండా కర్రలతో బాది చంపేస్తుంటాం. ప్రతి సర్పం విషపూరితం కాదనే అవగాహన కల్పిస్తూ మూగజీవాలను కాపాడుతున్న సర్పమిత్రులకి హ్యాట్స్ ఆఫ్. పురుషులకు

మాత్రమే నేర్పే కర్ర సాము, తమిళ నాట శిలంబన్‌గా పేరొందిన ఈ క్రీడలో ఐశ్వర్య ప్రతిభకనబరచడం అభినందనీయం. అనాథ పిల్లలకి చాలా మంది ఏదో ఒక సాయం చేయాలనుకుంటారు. హ్యాపీ బర్త్‌డే భారత్ సభ్యులు వీధి బాలల పుట్టిన రోజు నిర్వహిస్తూ, వారి అవసరాన్ని బట్టి ఆహారం, దుస్తులు, పుస్తకాలు అందిస్తూ సమాజంలో మార్పుకి దోహదపడుతున్నారు. వర్షంలో తడిసి ముద్దవుతున్న సరస్సుల లోకం, శిలలపై కలలు చెక్కినారు, అక్షర కిరణాలు, వివిధ దేశాల్లో వినాయక రూపాలు, డైవింగ్ దాటి డాడ్జింగ్ బాగున్నాయి.

-గిరిధరరావు, అనంతపురం

శిలంబన్ మహిళ

కర్రసాము చేసే వారు మనకి అరుదుగా కనిపిస్తారు. పురుషులకు మాత్రమే నేర్పే ఈ కళలో 27 ఏళ్ల అమ్మాయి అత్యుత్తమ ప్రతిభకనబరచడం గర్వకారణం. అమ్మాయిలు క్రీడల్లో రాణించాలంటే శిక్షణతో పాటు తల్లిదండ్రుల ప్రోత్సాహం ఉండాలి. సాధారణంగా తమ పిల్లలు డాక్టర్, ఇంజనీర్ అవ్వాలని తల్లిదండ్రులు కోరుకుంటారు. షూటర్ అవ్వాలనుకున్న కూతురి ఆశయాన్ని నిజంచేసేందుకు తండ్రి మణిలాల్ గోహిల్ కృషిచేశాడు. ప్రపంచ దేశాల్లో నగర వీధులు, సముద్రతీరాల్లో రూపుదిద్దుకున్న అర్థవంతమైన శిల్పాలు కళాకారుల అద్భుత ఊహకి నిదర్శనాలు. సరస్సుల లోకం, సర్ప మిత్రులు, ఇది నవీన్ లెక్క, వీధి బిడ్డకు పుట్టిన రోజు, ఆత్మీయులై ఆత్మహత్యలాపండి, ష్ అనుకున్నవే, డబ్బు ఆశించకుండా విద్య నేర్పుతున్న గురువుల అక్షరకిరణాలు, మారిషస్, లండన్, ఫ్రాన్స్ దేశాల్లోని వినాయక రూపాల విశేషాలు ఆకట్టుకున్నాయి.

- శోభారాణి, ఒంగోలు

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ.-520002.
మెయిల్ అడ్రస్: snehaweekly.praja@gmail.com

కోహిమా ప్రాంతంలోని ఆవాసాలు, వస్తు ప్రదర్శనశాలలు, ప్రవేశ మార్గాలు ఎక్కడ చూసినా పదునైన దుప్పి కొమ్ములు, ఏనుగు దంతాలు, పులిగోర్లు, ఇలా జంతు అవశేషాల అలంకరణలే కనిపిస్తాయి. ప్రకృతితో మమేకమైన నాగాల్యాండ్‌పై జరిగిన వరుస ముట్టడులని తిప్పికొట్టడంతో పాటు పెద్ద పెద్ద మృగాల్ని నేలకరిపించగల దిట్టలుగా నాగ ప్రాంతపు ఆగామీలు చరిత్రకెక్కారు. ఆగామీ తెగకి చెందిన ఒక వేటగాడు మైఖేల్ సోఫీ. వేటలో ఆరితేరిన ఈ వేటగాడి జీవితంలో చోటుచేసుకున్న ఓ సంఘటన తనలో మార్పుకి దారితీసింది. వేటని మానుకోవడమే కాక పర్యావరణ పరిరక్షకుడిగా మారి కోహిమా అడవుల్లో కలప రవాణా, జంతువుల వేట వంటి వాటిని నిషేధించేందుకు కృషిచేశాడు.

ఆగామీ వేట ఆగింది

నాగాల్యాండ్‌లో తరతరాలుగా నివసిస్తున్న వందలాది తెగల్లో వేటకు పేరొందిన తెగ ఆగామీ. 1830లో బ్రిటీష్ ఆక్రమణలపై తిరుగుబాటు చేపట్టిన యోధులు కొందరైతే, ఆరితేరిన వేటగాళ్లు ఇంకొందరు. ఆగామీల జీవనంలో వేటాడటం ఒక భాగంగా ఉంటుంది. నైపుణ్యం, తెగువతో కూడిన ఈ వృత్తిని వారు ఎంతో పవిత్రంగా భావిస్తారు. అలాంటి వృత్తిలో స్థిరపడ్డాడు సోఫీ. వేటకు సంబంధించిన సంప్రదాయ బల్లెం, అన్ని రకాల ఆయుధాలు, ఎయిర్ గన్‌లను ఉపయోగించడంలో ఆరితేరాడు సోఫీ. తోటి వేటగాళ్లతో కలిసి వలపన్ని క్రూరమైన అడవి జంతువులన్నిటినీ చంపగలడు. పక్షులు ఎగిరే వేగాన్ని అంచనా వేస్తూ వాటిని నేలకరిపించేస్తుంటాడు. ఒక రోజు తన జట్టు సభ్యులతో కలిసి కోహిమా అడవుల్లోని కోతులని వేటాడే పనిలో పడ్డాడు సోఫీ. వేటగాళ్లందరూ మూకుమ్మడిగా కోతులపై దాడి చేయడంతో అవి నేలకొరిగాయి. అయితే వాటికి తీవ్రంగా గాయాలవడంతో ఆ ప్రదేశమంతా రక్తసిక్తంగా మారింది. సోఫీ దాడి చేసిన ఒక కోతి.. తన చేతిలో గజగజా వణికిపోతున్న పిల్ల కోతికి గాయాలు కాకుండా దాన్ని ఒడిసి పట్టుకుంది. ఈ దృశ్యం అతన్ని కలచి వేసింది. ఊహించని ఆ ఘటన తన జీవితంలో మార్పుకి దారితీసింది. అప్పుడే వేటని మానుకోవాలనుకున్నాడు సోఫీ. నాగాల్యాండ్ జాతీయ పక్షి బ్లిత్ ట్రాగోపన్. 1993లో వీటిని అధికంగా వేటాడడంతో దాదాపు 300 పక్షులు చనిపోయాయి. వేటగాళ్ల దాడులకి కొద్ది కాలంలోనే ట్రాగోపన్‌లు అంతరించిపోతున్న పక్షిజాతులుగా మారాయి.





నాగాల్యాండ్‌లో కలప రవాణా ఎక్కువగా కొనసాగుతుండడంతో రానున్న కాలంలో ప్రకృతికీ పెను ప్రమాదం ఉందని గ్రహించాడు సోఫీ. స్థానిక గ్రామ పెద్ద టిసిలి సక్రితో కలిసి పర్యావరణ అవగాహనా సదస్సులని నిర్వహించే వాడు. వన్యమృగాలని కాపాడుకోవాలంటూ తను చెప్పే మాటలని తన జట్టు వేటగాళ్లెవరూ ఆలకించకపోగా తనని అవహేళన చేసే వారు. ముందు తరాలకి ప్రకృతి గొప్పతనం తెలియాలంటే మనం ఇప్పుడు వాటిని పరిరక్షించాలని తను పదేపదే చెప్పేవాడు. ప్రకృతిని కాపాడుకునేందుకు తను చేసే పోరాటంలో చేతులు కలపాలంటూ గ్రామస్తులని అభ్యర్థించేవాడు సోఫీ. వేట జీవనోపాధి కావడంతో సోఫీ మాటలకి ఎవరూ స్పందించగపోగా కోపంతో అతనిపై తిరగబడేవారు. గాయాలపాలైనా తన ప్రచారాన్ని ఆపేందుకు సోఫీ ఇష్టపడేవాడు కాదు. గ్రామంలో నిర్వహించిన ప్రతి అవగాహన సదస్సులోనూ గతంలో తనని కదిలించిన ఘటనని ప్రస్తావిస్తూ తనలో మార్పుకి కారణాలని వివరంగా చెప్పేవాడు. కొన్ని నెలల ప్రచారం తర్వాత గ్రామంలోని కొందరు వేటగాళ్లలో మార్పు తేగలిగాడు. సోఫీ ప్రచారంతో కోహిమాలోని అభయారణ్య ప్రకృతి పరిరక్షణ సంస్థలో భాగమైన అటవీ ప్రాంతంలో తొలుత 20 కి.మీ.ల మేర వేటను నిషేధించింది. 2002 నుంచి కలప రవాణా వన్యమృగాల వేటని అక్కడ పూర్తిగా నిషేధించారు. గ్రామాల్లో ఇలాంటి మార్పు రావడం ఇక్కడే మొదలవడంతో సోఫీ నివసించే గ్రామం ఆకుపచ్చ గ్రామంగా గుర్తింపు తెచ్చుకుంది. గ్రామంలోని కొందరు యువతతో కొనొమ యూత్ ఆర్గనైజేషన్‌ని స్థాపించాడు సోఫీ. ఈ బృందంలోని సభ్యులందరూ ప్రకృతి పరిరక్షిస్తూ, వన్యప్రాణి సంరక్షణకు కృషిచేస్తున్నారు. కోహిమాకు వచ్చే పర్యాటకులకు గైడ్‌గా సేవలందిస్తున్నాడు సోఫీ.

✦

ఒక మలుపు



స్టార్

**కథో,
సినిమానో, హీరోనో
ఎవరోకరి గురించి నిత్యం చర్చలే. పెద్ద పెద్ద హీరోలు, నిర్మాతలు ఆ ఇంటి మెట్లు తొక్కుతూనే ఉండేవారు.ఎప్పుడూ హడావుడిగా ఉండేది. సినిమా డైరెక్టర్ ఉన్న ఇల్లంటే ఇలానే ఉంటుంది. సాధారణంగా ఆ సినిమా ప్రభావం పిల్లలపైనా పడుతుందంటారు. కానీ ఆ కుటుంబంలో ఓ వ్యక్తికి ఆ రంగంపై ఆసక్తి లేదు. తల్లిదండ్రులకున్న రంగుల లోకం, ఈయనకున్న కలల ప్రపంచం వేర్వేరు. ఈ ప్రపంచాన్ని చాపచుట్టేసినట్టు తిరిగేయాలని ఆ కుర్రాడి కల. అందుకే విమానానికి పైలట్ కావాలనుకున్నాడు. అలా అయినా ఈ ప్రపంచాన్ని చుట్టేయొచ్చు అని భావించాడు. కానీ ఓ సినిమా ఆయన జీవితాన్ని మలుపు తిప్పేసింది. చివరకు తండ్రుండే రంగుల లోకంలోకే వచ్చేశాడు. అతనే హీరో ఆది పినిశెట్టి.**

ఆది పుట్టింది చెన్నైలోని ఓ సినిమా కుటుంబంలోఆది ప్రముఖ దర్శకుడు రవి రాజా పినిశెట్టి పెద్ద కుమారుడు. ఆది తమ్ముడు సత్యప్రభాస్ పినిశెట్టి కూడా దర్శకుడే. ఆది అసలు పేరు సాయి ప్రదీప్. . అందుకే చిన్నప్పటి నుంచి రంగుల ప్రపంచం గురించి తెలిసింది. కానీ ఆ రంగమంటే ఆసక్తి ఉండేది కాదు.

- కంప్యూటర్ సైన్స్‌లో బీఈ చేశాక పైలట్ కావాలని కలలు కనే వాడు. ఎందుకుంటే ఆదికి ప్రపంచమంతా చుట్టొచ్చేయాలని కోరిక. ఈయనకు ఎక్కువగా విహార యాత్రలకు వెళ్లాలని ఉండేది. ఆ కోరిక పెద్దాయ్యాక వచ్చింది కాదు. చిన్నప్పటి నుంచే వాళ్ల నాన్న రవిరాజా ఇంట్లో కనిపించి ఆ రోజు ఆదికి స్కూల్ సెలవైతే చాలు ఎక్కడికైనా తీసుకెళ్లాల్సిందే. ఇతనికి విహరించడమంటే అంటే ప్రాణం. అందుకే ఎయిర్‌ఫోర్స్ రంగాన్ని ఎంచుకున్నాడు.
- దాని కోసమే బీఈ అయిపోయిన వెంటనే పైలెట్ శిక్షణకు దరఖాస్తు కూడా పెట్టుకున్నాడు. ఆ పిలుపు వచ్చే వరకూ ఖాళీగా ఉండడం ఎందుకని తమిళనాడులో కర్రతో చేసే ఫైటింగ్‌లో శిక్షణ పొందాడు. దీన్ని శిలంబమ్ లేదా శిలమ్‌బాట్టమ్ అని పిలుస్తారు. ఇది కేరళ కర్రసాములాంటిది.
- ఈ తరుణంలో దర్శకుడు సామి ఓ కథతో ఆది ఇంటికొచ్చాడు. అతను చెప్పిన కథ ఆదికి నచ్చడంతో హీరోగా మొదట సినిమా తమిళంలో చేయడానికి అంగీకరించాడు. ఆ చిత్రమే 'మృగం'. తమిళంలో మిరుగమ్ పేరుతో 2007లో విడుదలైంది. ఆ సినిమా మంచి విజయాన్నే సాధించింది.
- 'మృగం'లో నటనకు ఆదికి మంచి మార్కులు పడ్డాయి. ఈ సినిమాకు ముందే తెలుగులో 'ఒక వి చిత్రం' అనే సినిమాలో హీరోగా నటించాడు. మధుశాలిని కథానాయిక. ఈ చిత్రం 2006లో ప్రేక్షకులి ముందుకొచ్చింది.
- తర్వాత రెండేళ్ల పాటు ఆది ఏ భాషా చిత్రాల్లోనూ నటించలేదు. విరామం తీసుకున్నా 2009లో చేసిన చిత్రం భారీ సక్సెస్‌ను సాధించింది. ఆ సినిమాయే 'వైశాలి'. తమిళంలో 'ఈరమ్' పేరుతో విడుదలైంది. సింధుమీనన్ కథానాయికగా నటించింది. శరణ్య మోహన్, నంద సపోర్టింగ్ రోల్స్‌లో మెప్పించారు.

ఈ చిత్రాన్ని ప్రేక్షకులు అమితంగా ఆదరించారు. వాసుదేవన్‌గా ఆది అదరగొట్టేశాడు. ఒక పక్క ప్రేమికుడుగా, మరోపక్క పోలీస్ ఆఫీసర్‌గా భలే చేశాడు.

- ఈ చిత్రం తర్వాత మూడేళ్ల పాటు ఈ హీరో తెలుగు ప్రేక్షకులకు కనిపించలేదు. కానీ తమిళంలో మాత్రం ఏడాదికి ఒకటో రెండో సినిమాలు చేస్తూనే ఉన్నాడు. 2013లో మరోసారి ఇలా మెరిసి మళ్లీ మరో మూడేళ్లు మాయమైపోయాడు.
- 2010లో అయ్యనార్, ఆడు పులి వంటి రెండు చిత్రాలు తీశాడు. 2012లో 'అరవాన్'లో చేసి మెప్పించాడు. తర్వాత ఏడాది తెలుగు వారి గుండెలను కొల్లగొట్టే ప్రయత్నంలో భాగంగానే 'గుండెల్లో గోదారి'లో చేశాడు. ఈ చిత్రం తెలుగు, తమిళ భాషల్లో విడుదలైంది. మంచు లక్ష్మీ ఇందులో కథానాయికగా నటిస్తూనే ఈ సినిమాను నిర్మించింది. బీవీఎస్ రామారావు రాసిన 'గోదావరి కథలు' నవల ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందించారు.
- గత ఏడాది ఆది తమ్ముడు సత్య ప్రభాస్ పినిశెట్టి మొదటిసారిగా దర్శకుడిగా ఎంట్రీ ఇచ్చాడు. అది కూడా తన అన్నయ్యనే హీరోగా పెట్టి సినిమా తీశాడు. ఆ చిత్రమే 'మలుపు'. చెన్నైలో జరిగిన ఓ వాస్తవ సంఘటన ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కించాడు సత్య ప్రభాస్. హీరో, దర్శకుల తండ్రి రవిరాజా పినిశెట్టే దీనికి నిర్మాత.
- వీరి కుటుంబం అంతా కలిసి తీసిన ఈ 'మలుపు' చిత్రం తమిళంలో 'యగవరయినుమ్ నా కాక్క' పేరుతో గత ఏడాది ప్రేక్షకుల ముందుకొచ్చింది. తెలుగులో ఈ ఏడాదిఆరంభంలో విడుదలైంది. రెండు భాషల్లోనూ విజయం సాధించింది.
- ఈ సినిమా అటు దర్శకుడు సత్య ప్రభాస్‌కు, ఇటు హీరోగా ఆదిల కెరీర్‌లకు ఓ 'మలుపు'గా గుర్తించుకునే విజయాన్నిచ్చిందనే చెప్పాలి.
- ఆది హీరోగానే కాకుండా నటనకు ఆస్కారముంటే ఏ పాత్ర అయినా చేస్తానని చాలా సార్లు ప్రకటించాడు. దాన్ని నిజం చేస్తూ ఈ ఏడాది అల్లు అర్జున్ హీరోగా చేసిన 'సరైనోడు' చిత్రంలో ప్రతినాయకుడిగా చేసి మెప్పించాడు. ఈ సినిమాలో నాయకుడు, ప్రతినాయకులు సరిపోయారా..అనే విధంగా ఇద్దరూ చేశారు. సీఎం కొడుకుగా క్రూరమైన విలన్‌గా చక్కగా ఆ పాత్రలో ఒదిగిపోయాడు ఆది.

-కొప్పుశెట్టి దేవరాజు

కార్టూన్ పంచ్



నవ్వుల్ - పువ్వుల్

కిసుక్కు

ప్రయాణీకుడు: నా జేబులో చెయ్యెందుకు పెట్టావ్?

దొంగ:లైటర్ కోసం సార్

ప్రయాణీకుడు: నన్ను అడగొచ్చు కదా!

దొంగ: కొత్త వాళ్లతో మాట్లాడాలంటే నాకు చచ్చేంత మొహమాటం.



క్లాత్

వెంగళప్ప: షర్ట్‌కి మంచి క్లాత్ ఉంటే చూపించండి

సేల్స్‌మెన్: ప్లేన్‌లో చూపెట్టమంటారా?

వెంగళప్ప:హెలికాప్టర్‌లో చూపించండి....

రాంగ్ నెంబర్

వెంగళప్ప: నిన్న నేను కరీనా కపూర్‌కి ఫోన్ చేసి మాట్లాడాను తెలుసా?

సుబ్బు: నిజమా! ఏమంది?

వెంగళప్ప: రాంగ్ నెంబర్ అంది.

దూరంగా

సిగరెట్‌కి ఒక పొడవు పైపు తగిలించి పొగతాగుతున్నాడు రామనాథం

అప్పారావు : అదేంట్రా సిగరెట్ అలా తాగుతున్నావ్...

రామనాథం : సిగరెట్లకి వీలైనంత దూరంగా ఉండమన్నారు డాక్టర్ అందుకే ఇలా..

అంతటా యంత్రుడే

- అజయ్ కుమార్ వారాల
9502395077

వారం క్రితం రోబోటిక్స్‌కు చెందిన రెండు వార్తలు మళ్లీ వాటి గురించి మరింత పట్టించుకునేలా చేశాయి. దేశంలో తొలిసారిగా ఓ ప్రైవేట్ బ్యాంక్ బాట్స్ సాయంతో కొన్ని సేవల్ని ప్రారంభించింది. కస్టమర్ ఐడీలు చేయడం, మొబైల్ నంబర్లు, చిరునామాల్ని మార్చడం, ఏటీఎంలకు సంబంధించిన కొన్ని విషయాల్ని నివృత్తిపరచడం లాంటి పనుల్ని రోబోటిక్స్‌కు అప్పగించిందా బ్యాంకు. మరో వార్త అంతర్జాతీయంగా సంచలనాన్ని కలిగించింది. అతి సున్నితమైన కంటి శస్త్ర చికిత్సను రోబోట్ సాయంతో పూర్తి చేసింది బ్రిటిష్ వైద్య బృందం. రెటీనాలో మిల్లీమీటర్‌కు వందో వంతున పొరను తొలగించేందుకు ఆక్స్‌ఫర్డ్‌లోని జాన్ ర్యాడ్‌క్లిఫ్ ఆస్పత్రి వైద్యులకు రోబో వీలు కల్పించింది. ఈ రెండు వార్తలు రోబోటిక్స్‌లో శరవేగంగా మారుతున్న విషయాల్ని జనంలోకి తీసుకెళుతున్నాయి. కార్లకు పెయింట్‌లు వేసే స్థాయి నుంచి శస్త్ర చికిత్సలు చేసే స్థాయి వరకు వాటి పరిధి పెరిగిపోయింది. అంతటా యంత్రుడే అయిపోతున్న కొత్త శకంలోకి అడుగుపెట్టే తరుణంలో ఈ వారం అట్టమీది కథ.

ఇప్పటి వరకు యంత్రాలంటే మనిషి నడిపేవిగా మాత్రమే అనుకుంటున్నారు. కానీ కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్-ఏఐ)ను జోడించడంతో రోబోటిక్స్ పరిధి పెరిగిపోయింది. నిన్న మొన్నటి వరకు రిమోట్ కంట్రోల్ కార్ల మాదిరిగా ఆడుకున్న యంత్రాలే స్వయంగా విధులు నిర్వర్తించే స్థాయికి చేరుకుంటున్నాయి. మరో విశేషమేమంటే మెల్‌బోర్న్‌లోని ఆర్ఎంఐటీకి చెందిన శాస్త్రవేత్తలు ద్రవ రూప లోహ మిశ్రమాన్ని యానిమేట్ చేయగలిగారు. రూపం మార్చుకునే ఈ ద్రవ లోహం ద్వారా ఎలక్ట్రానిక్ పరికరాల్ని రూపొందించొచ్చని అవి జీవ కణజాలాన్ని పోలినట్టు సమాచార వ్యవస్థలుగా పనిచేయొచ్చని ప్రయోగాల్లో తెలుసుకున్నారు. ప్రస్తుతానికి స్విచ్‌లు, పంప్‌లుగా పనితీరును పరీక్షించారు. దీనిపై మరింత పట్టు సాధిస్తే టెర్మినేటర్ సినిమాలోని టి-1000 రోబోలా ఆకృతిని మార్చుకుని పనిచేసే రోబోల్ని రూపొందించొచ్చని అంటున్నారు. రోబోట్స్‌లో మరో విప్లవానికి నాంది పలికేలా లోహాలతో కాకుండా 3-డి ప్రింటర్ సాయంతో సున్నితమైన రబ్బర్‌లా మెత్తగా ఉండే రోబోట్ 'ఆక్టోబాట్'ను రూపొందించారు హార్వర్డ్ విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్రవేత్తలు. 300 ఆక్టోబాట్‌లు అతి తక్కువ ఖర్చుతో తయారుచేయగలిగారు. ఇవి మెకానికల్‌గా, ఎలక్ట్రానికల్‌గా కాకుండా ద్రవాల వల్ల కదిలేలా చేయడం విశేషం. అచ్చు మన చేయి చేయగలిగిన సున్నితమైన పనుల్ని తేలిగ్గా చేస్తూ అంతకు ముందు అనుకున్న అడ్డంకుల్ని తొలగిస్తే ఈ మధ్య గూగుల్‌కు చెందిన బోస్టన్ డైనమిక్స్‌కు చెందిన రోబో అట్లాస్ మరో సవాల్‌ను అధిగమించింది. పేపర్ రాకెట్‌ను స్కూల్ పిల్లాడిలా విసిరి ముచ్చటగొలిపిన అట్లాస్ మరో అద్భుతాన్ని చేసి చూపించింది. ఐహెచ్ఎంసీ ఆల్గారిథమ్స్‌తో తన బాడీని ఓ సన్నని చెక్క ముక్కపై బ్యాలెన్స్ చేసి అరుదైన ఫీట్‌ను సాధించింది. మనిషి ఇలా బ్యాలెన్స్ చేయడానికి చాలా శిక్షణ తీసుకోవాలి.

విచక్షణ కూడా..

మనిషి మాత్రమే చేసే.. కుదిరే వంటి పదాల్ని రోబో డిక్షనరీల నుంచి చెరిపేసుకుంటున్నాయి. అందుకే మానవత విలువల్ని, విచక్షణను రోబోట్స్‌కు నేర్పేందుకు ఈపాటికే కాలిఫోర్నియా విశ్వవిద్యాలయం ప్రత్యేక ఏఐ కేంద్రాన్ని స్థాపించింది. మనుషులతో సఖ్యతగా ఉండేలా కృత్రిమ మేధ ఉన్న రోబోటిక్స్‌కు శిక్షణనిచ్చేందుకు ఏ తరహా ప్రోగ్రామ్‌లను, అల్గారిథమ్‌లను రూపొందించాలనే విషయంపై నిపుణులు పరిశోధనలు మొదలు పెట్టేశారు. తోటి కార్మికుడిలా, ఉద్యోగిలా మనిషితో కలసి పనిచేసే కొలాబరేటివ్ రోబోలు



రాజ్యమేలనున్న వచ్చే దశాబ్దాల్లో దీని అవసరం ఎంతో ఉంది. నాసా ఏకంగా స్పేస్ రోబోటిక్స్ చాలెంజ్‌ను ప్రకటించింది. అంగారక గ్రహంలో పరిశోధనల కోసం ఓ రోబోను తయారు చేసివ్వండని ఎంఐటీతో పాటు మిగతా రోబోటిక్స్ నిపుణులకు పోటీని పెట్టింది. మనిషి బదులు పంపించే ఆ రోబో మనిషిలా అక్కడ తిరుగుతూ ముఖ్యమైన ప్రయోగాల్ని చేస్తూ, సమాచారాన్ని సేకరిస్తూ గ్రహాంతర జీవనం, నివాసాల అవకాశంపై మనల్ని గైడ్ చేస్తాయని ఆశిస్తున్నారు. ఉబెర్ తమ పార్కింగ్ లాట్ పాట్రోలింగ్‌కు ఓ సెక్యూరిటీ రోబోను నియమించింది. వీటన్నింటి కన్నా మరింత ప్రాక్టికల్‌గా, ఆందోళన కలిగించేలా డల్లాస్ పోలీసులు బాంబ్ డిస్పోజల్ రోబోను ఉపయోగించారు. డల్లాస్ కాల్పుల ఘటన నిందితున్ని దాని సాయంతో అంతమొందించారు. చివరాఖరికి పోకెమాన్ గోను కూడా ఆడేస్తోంది రోబో బాక్స్టర్. అమెజాన్ వంటి సంస్థలు వేర్‌హౌజ్‌ల్లో రోబోటిక్స్‌తోనే ప్రధానంగా పనిచేయిస్తున్నాయి. ఆ దశ కూడా దాటి డ్రోన్లతో వస్తువుల్ని సరఫరా చేయించాలనే ఆలోచనలో ఉన్నాయి. దక్షిణ కొరియా వంటి దేశాల్లో సేవా రంగంలోకి రోబోలు చొచ్చుకువచ్చాయి. 'గ్రావిటీ' వంటి సినిమాలకు కెమెరామెన్ రోబోలను వాడారు. లేకుంటే ఆ సినిమాల్లో కొన్ని సన్నివేశాల్ని మనిషి తీయగలిగే ఆస్కారమే ఉండేది కాదు. ఏతీయాన్స్ టగ్స్ అనే రోబోలు ఆస్పత్రి ట్రాలీలను లాక్కెళుతున్నాయి. గుక్క తిప్పుకోకుండా చెప్పాల్సిన రోబో విజయాలన్నీ ఓ విషయాన్ని మరింత స్పష్టం చేస్తున్నాయి. ఇన్నాళ్లు అనుకుంటున్న రోబో విప్లవం మరెంతో దూరంలో లేదని. ఇప్పటికే చాలా రంగాల్లో రోబోటిక్స్ ప్రవేశించాయి. ముఖ్యంగా పరిశ్రమల్లో అసెంబ్లీ లైన్‌లో కీలకంగా పనిచేస్తున్నాయి. ఫెన్స్‌లు, ప్రత్యేక గదుల మధ్య ఉన్న రిపిటీటివ్ రోబోలు వాటిని దాటి ఇప్పుడు కొలాబరేటివ్ రోబోలుగా పరిణామం చెంది తోటి కార్మికులతో కలసి నేర్పుగా, వీలుగా పనిచేస్తున్నాయి. ఇది పరిశ్రమల్లో భారీ మార్పును తేనుంది. 2020 నాటికి అంటే మరో నాలుగైదేళ్లలో రోబోలు తమ ముద్రను వేసే రంగాల్లో సేవా, మేధో రంగాలు కూడా ఉన్నాయనే విషయం ఒకింత విస్మయాన్ని కలిగిస్తున్నా ఆసక్తికరంగా ఆ ప్రభావాన్ని ప్రపంచం గమనిస్తోంది. మరో ఇరవై ఏళ్లలో సుమారు 700 రకాల వృత్తి నిపుణుల పనుల్ని భర్తీ చేసే అవకాశముందని ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంతో పాటు పలు సంస్థల సర్వేలు. రిసెప్షనిస్టులు, సేల్స్ పర్సన్‌లు, సెక్యూరిటీ గార్డులు, ఫాస్ట్‌ఫుడ్ వంటవాళ్లు, ట్యాక్సీ డ్రైవర్లు వంటి ఉద్యోగాలతో పాటు ఎన్నో వృత్తుల్లోకి రోబోలు ఈ పాటికే వచ్చేశాయి. సాంకేతిక రంగంలో వస్తున్న విపరీత మార్పుల వల్ల ఆ పనులు చేసే రోబోల ఖరీదు కూడా దిగి రానుంది.

రోబో సేవకులు

చైనాలోని జెజియాంగ్ ప్రావిన్స్‌లోని ఓ రెస్టారెంట్‌లో గ్జియావోలాన్ దాని అసిస్టెంట్ గ్జియావోటావో మీ టేబుల్ దగ్గరకు వచ్చి వినమ్రంగా పలకరిస్తాయి. మీరు ఆర్డర్ చేసే మెనూను వడ్డిస్తాయి. అవి రెండూ సర్వర్ రోబోలు. అవే కాదు చెఫ్ రోబోలు వచ్చేశాయి. ఓ అంతర్జాతీయ ఫుడ్ ఫ్రాంచైజీ ఓ మల్టీ టాస్కర్ రోబోను రూపొందించాలని ఓ రోబోటిక్స్ సంస్థను సంప్రదించింది. అది కస్టమర్ల నుంచి ఆర్డర్ తీసుకోవాలి, గల్లా పెట్టె లెక్కల్ని చూడాలి, వంట గదిలోకి వెళ్లి బర్గర్‌ను తిరగేయగలగాలి, పదార్థాల్ని సర్వ్ చేయాలి. వీటిని చేసి చూపించిందో రోబో. ఫ్రాన్స్‌కు చెందిన ఓ కంపెనీ రోమియో అనే ఓ రోబోను రూపొందించింది. 1.40 మీటర్ల ఎత్తుతో సాటి మనిషిని తలపించే ఈ రోబో 2017 కల్లా మార్కెట్‌లోకి రానుంది. వృద్ధాశ్రమాల్లో వీటిని వినియోగిస్తారట. ఒక సేవకుడు ఏయే పనుల్ని చేస్తాడో అలా రోమియో ద్వారాల్ని తెరుస్తుంది. టేబుళ్లు, పక్క సర్దుతుంది. వృద్ధులతో చక్కగా సంభాషిస్తుంది. మందుల్ని సరైన మోతాదులో సరైన సమయంలో అందిస్తుంది. ఏదైనా హెల్త్ ఎమర్జెన్సీ అయితే వెంటనే వైద్యులకు ఫోన్ చేస్తుంది. దీనికి ముందే వచ్చిన నావో అనే బుజ్జి రోబో పిల్లల్ని ఆటల పాటలతో ఉత్సాహపరుస్తుంది. పాఠాలు చెబుతుంది. దీన్ని ఇప్పటికే 80 పాఠశాలల్లో

రోబో ప్రభావం

ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం సర్వే ప్రకారం రానున్న ఒకటి రెండు దశాబ్దాల్లో ఒక్క అమెరికాలోనే కంప్యూటరైజేషన్ రోబోటిక్స్ ఎక్కువ ప్రభావితం చేసే వృత్తులివే. ప్రస్తుతం ఉన్న ఉద్యోగాల్లో 47 శాతానికి పైగా అవి కోత వేయనున్నాయి.

లోన్ ఆఫీసర్లు	- 98 శాతం
రిసెప్షనిస్టులు, ఇన్ఫర్మేషన్ క్లర్కులు	- 96 శాతం
పారాలీగల్, లీగల్ అసిస్టెంట్‌లు	- 94 శాతం
రిటైల్ సేల్స్‌పర్సన్‌లు	- 92 శాతం
ట్యాక్సీ డ్రైవర్లు, చాఫర్లు	- 89 శాతం
మెడికల్ రికార్డు టెక్నీషియన్లు	- 91 శాతం
మెడికల్ సెక్రటరీలు	- 81 శాతం
సెక్యూరిటీ గార్డులు	- 84 శాతం
ఫాస్ట్‌ఫుడ్ కుక్స్	- 81 శాతం
బార్‌టెండర్లు	- 77 శాతం
పర్సనల్ ఫైనాన్సియల్ అడ్వైజర్లు	- 58 శాతం
కంప్యూటర్ ప్రోగ్రామర్లు	- 48 శాతం



జర్నలిస్టులుగా..

మనం ఊహించుకున్నట్టు ఓ రోబో వీధుల వెంట ప్రెస్ మీట్‌ల వద్ద తిరుగుతూ వార్తలు సేకరిస్తుందేమో అనుకోకూడదు. అంతర్జాలంలో ఉన్న సమాచారాన్ని క్రోడీకరించి కేవలం నిమిషాల్లో క్రీడలకు సంబంధించిన వార్తా కథనాల్ని రాసేస్తున్నాయి కొన్ని బాట్స్. వీటిని అంతర్జాతీయ న్యూస్ ఏజెన్సీ 'అసోసియేటెడ్ ప్రెస్' (ఏపీపీ) వినియోగించింది. ఒక క్వార్టర్‌లో 4400 కథనాల్ని అవి అల్లేయగలవట. సాధారణంగా 300 కథనాల్ని మాత్రమే ఏపీపీ ఆ కాలంలో రూపొందించగలుగుతోంది. ఎడిటోరియల్ కంటెంట్‌ను కూడా చాలా నాణ్యతతో అందించగలవని ఏపీపీ అంటోంది. అది కూడా చాలా తక్కువ ఖర్చుతో. ఓ ప్రఖ్యాత క్రీడా విలేకరితో ఈ బాట్‌లను పోటీకి పెడితే ఆయనకు 7 నిమిషాల సమయం పట్టిన కథనాన్ని కేవలం రెండే నిమిషాల్లో రాసేశాయట. ఆటోమేటెడ్ ఇన్‌సైట్స్ అనే సంస్థ రూపొందించిన ఈ బాట్స్‌ను ఏపీపీ పూర్తిగా వినియోగంలోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తోంది. దీని వల్ల జర్నలిస్టులు పరిశోధనాత్మక కథనాలు, రిపోర్టింగ్‌కు ఎక్కువ సమయం వెచ్చించవచ్చని సమాచార విశ్లేషణను ఇవి చూసుకుంటాయని చెబుతున్నారు. మనం ముందు ఊహించుకున్నట్టు క్షేత్రస్థాయికి వెళ్లి వార్తా సేకరణ చేసే రోబోల కాలాన్ని కొట్టిపారేయడానికి లేదని నిపుణులు అంటున్నారు. దానికి తొలి అడుగే బాట్ జర్నలిస్టులు.



కొలాబరేటివ్ రోబోటిక్స్

వాడుతున్నారు. దక్షిణ కొరియా, జపాన్‌ల్లో అయితే మనిషిని పోలిన రోబోలే కాదు పెంపుడు జంతువుల్లాను రోబోలను తయారు చేసి డిమెన్షియా, పార్కిన్‌సన్ వ్యాధిగ్రస్తులు, వృద్ధుల మానసిక స్థితి మెరుగుదలకు ఉపయోగిస్తున్నారు. వీటిని ఇళ్లలోను పెంచుకుంటున్నారు...అదే వాడుకుంటున్నారు. పెట్ రోబోలుగా పిలిచే ఇవి కేవలం ముద్దుగా మారాం చేయడం వరకే పరిమితం కాకుండా దిన చర్యల షెడ్యూల్‌కు, ఇతర విషయాల్లోను సంప్రదింపులు జరుపుతూ రోజు జీవితాన్ని తేలిక చేస్తున్నాయి.

పంట పండిస్తూ..

వ్యవసాయంలో యాంత్రీకరణ ఫలాలు మన దేశంలో అంతగా తెలీదు. కానీ అమెరికా, యూరప్ దేశాల్లో ఒకప్పుడు 70 శాతంగా ఉన్న మానవ కార్మికులు ఇప్పుడు కేవలం 2 శాతానికే పరిమితమయ్యారు. ఈ కార్మికుల అవసరాన్ని కూడా కుదించేయడానికి రోబోటిక్స్ రంగం ప్రయత్నిస్తోంది. దుక్కు దున్ని, నారు పోసి, నీరు పెట్టడం వరకే పరిమితం కాలేదు. ఫలదీకరణకు కీలకమైన కీటకాలుగా కూడా అవతారమెత్తాయి.

డ్రైవర్ సీట్ ఉండదేమో..

గూగుల్ సెల్ఫ్ డ్రైవింగ్ కారు గురించి వార్తలే వార్తలు. సింగపూర్ 2019 నాటికి స్టీరింగ్ లేకుండా కార్లను రోడ్ల మీదకు తేవాలని ఆలోచిస్తుంటుంటే 2025కి స్టీరింగే లేని కార్లు వచ్చేస్తాయని రోబోటిక్స్ నిపుణులు అంటున్నారు. 'ఒట్టో' వంటి భారీ వాహన సంస్థలయితే మరో అడుగు ముందుకేసి సొంతగా ప్రయాణించగల ట్రక్కులను అందుబాటులోకి తెస్తున్నామని ప్రకటించింది. రవాణా రంగాన్ని మార్చేయనున్న ఇలాంటి వినూత్న రోబోటిక్ ఆవిష్కరణలు సాధ్యపడితే డ్రైవర్ సీటే కనిపించదేమో.

సైనికుడూ..

యుద్ధాల్లో ఇప్పటికే రోబోలను వాడేస్తున్నారు. అమెరికాకు చెందిన ఎల్‌ఎస్3 ఆల్ టెర్రైయిన్ మెషీన్ యుద్ధ క్షేత్రంలో క్రియాశీలకంగా మారింది. ఆయుధాలను, ఇతర సరఫరాలను తరలించేందుకు దీన్ని వినియోగిస్తున్నారు. గోడల్ని దాటగలదు, రివ్వున పరిగెత్తగలదు. ఇక్కడో విషయం ఆగలేదు. ఏకంగా సైనికుడు స్థానాన్నే భర్తీ చేసే రోబోల తయారీని దాదాపు అన్ని పెద్ద దేశాలు ప్రారంభించేశాయి. రూపకల్పనలో ఉన్నవి కొన్నయితే, ప్రయోగ క్షేత్రాల్లో నమ్మశక్యం కానీ ఫలితాల్ని అందిస్తున్నవి ఉన్నాయి.

తేనేటీగలు 85 శాతం కాయగూర పంటల్ని ఫలదీకరణ చేస్తున్నాయి. కానీ వాటి సంఖ్య ఒక్కసారిగా పడిపోయింది. కొన్ని చోట్ల తేనేటీగల ఉనికి కూడా కనిపించడం లేదు. దీనికి పరిష్కారంగా 'రోబోబీస్‌'పై పరిశోధనలు ఊపందుకున్నాయి. 2024 కల్లా అవి వినియోగంలోనికి రానున్నాయి. మూడు సెం.మీ. పరిమాణంలో ఉండే ఈ రోబో బీ ఒక్కోటి రోజుకు 250 పూలను ఫలదీకరించగలవని ప్రయోగ ఫలితాలొచ్చాయి.

కుటుంబ సభ్యుడిగా..

రోబోటిక్స్ నిపుణుడు హిరోషి ఇషిగురో తన రోబో కవలను లోకానికి పరిచయం చేసి ఏళ్లు గడుస్తున్నాయి. ఎవరు మనిషో ఎవరు యంత్రుడో పోల్చుకోలేనంత దగ్గరగా ఉంటుందా రోబో. ఆండ్రాయిడ్‌లు, గైనాయిడ్‌లుగా పిలిచే ఈ తరహా రోబోల్ని చాలామందే తయారు చేయించుకుంటున్నారు. వాటిని కుటుంబ సభ్యుల్లా చూసుకుంటున్నారు. ఆ వ్యక్తి ప్రవర్తనను, హావభావాల్ని పలికించగల ఆ రోబోలు వ్యక్తుల ఇష్టాయిష్టాలు, అభిరుచుల్ని అర్థం చేసుకుని వారిని నడుచుకుంటాయి. కనురెప్పల స్పందన నుంచి చేతి వేళ్ల చర్మం వరకు అచ్చు మనిషిని తలపించే ఈ రోబోలతో ప్రేమలో పడిపోతున్న వాళ్లు కూడా ఉంటున్నారంటే ఇవి ఎంత సఖ్యంగా, సాన్నిహిత్యంగా మనిషికి దగ్గరగా ఉంటున్నాయో అర్థం చేసుకోవచ్చు. వీటిని తయారుచేసేందుకు ఒక్క జపాన్‌లోనే 300 కంపెనీలు ఓ కన్సార్టియమ్‌గా ఏర్పడి అల్ట్రా సోఫిస్టికేటెడ్ రోబోలను 2020 నాటికి మార్కెట్‌లో అందుబాటులోకి తేనున్నాయి. సామాజిక, సాంఘిక, కుటుంబ సాహచర్యం వంటి అంశాల్ని ఏఐ సాయంతో వీటికి అందించనున్నారు. అంటే కుటుంబ సభ్యుడిలా అవి ఇంట్లో భాగస్తులు కానున్నాయి.. ఇవే ఇంకాస్త ముందుకు వెళ్లి జీవన సహచరులుగాను కొన్ని ..బాట్స్ రానున్నాయి. 2025 నాటికి శృంగారపరమైన వృత్తులు, విషయాల్లో రోబోలు సేవలు అందించనున్నాయని గిగాఓమ్ రీసెర్చ్ అధ్యయనంలో తేలింది.

రోబోటిక్స్ ఏం మార్చబోతున్నాయి

మన ఆవిష్కరణలే మనకు ఉద్యోగాలనిస్తాయి. పారిశ్రామిక విప్లవం వ్యవసాయ రంగం నుంచి శ్రామికుల్ని మరిన్ని వృత్తులకు దారి మళ్లించింది. వ్యవసాయ కార్మికులు కొత్త రంగాల్లో వేలాది రకాల వృత్తులు, ఉద్యోగాలకు మారారు. రిపేర్‌మెన్‌ల నుంచి వెబ్ డిజైనర్లు, ప్రోగ్రామర్ల వరకు వేలాది వినూత్న రంగ ఉద్యోగాల్ని యంత్రాలే సృష్టించాయి. ప్రస్తుతం కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్-ఏఐ)ను ప్రోది చేసుకుని యంత్రుడి (రోబో)గా మరో కొత్త విప్లవానికి ఊహకందని మరిన్ని కొత్త రంగాల్ని పరిచయం చేయబోతున్నాడు. 19వ శతాబ్దంలో అస్సలు ఊహించని సైన్స్ ఫిక్షన్ అని కొట్టి పారేసిన ఎన్నో మార్పులు, ప్రభావాలు, సాంకేతిక రంగాలు 20వ శతాబ్దాన్ని ఎలా రాజ్యమేలాయో.. ఇప్పుడు రోబోటిక్ విప్లవం సింగులారిటీని దాటి మరో సాంకేతిక యుగంలోకి మనిషిని బలవంతంగానైనా కూడదీసుకుపోయే అవకాశం ఉంది. మనిషి మేధను దాటి రోబోటిక్స్ మేధ అభివృద్ధి జరగడమే సింగులారిటీ. అది రెండు, మూడు శతాబ్దాల్లో సాధ్యమని సాంకేతిక రంగ విశ్లేషకులు చెబుతున్నారు. క్వాంటం కంప్యూటింగ్, నానో టెక్నాలజీ వంటి ఉన్నపాటున ఒకటి, రెండేళ్లల్లోనే ఊహించని మార్పులు తెచ్చే అవకాశమున్న రంగాలు. వాణిజ్య, ఆర్థిక రంగ విధానాల్లోను జాగ్రత్తలు తీసుకుంటున్నారు. రోబోటిక్స్ ప్రభావం వల్ల వస్తూత్పత్తి తేలికై ఖర్చు తగ్గుతుంది. రోబోలు స్వతహాగా నేర్చుకుంటున్నాయి. మరో రోబోతో కలిసి పనిచేస్తున్నాయి. ఇది పెద్ద మార్పు. ఒకప్పుడు

మెయిన్ ఫ్రేమ్ కంప్యూటర్ల ద్వారా నడిచేవి ఇప్పుడు పీసీ స్థాయికి దిగొచ్చాయి. అంటే అంతో కొంతో కంప్యూటర్లపై అవగాహన ఉన్న వాళ్లు కూడా వీటిని ఉపయోగించడం తేలిక. నిర్వహణ ఖర్చు తగ్గిపోతుంది.సాంకేతికాభివృద్ధితో ఖరీదు అమాంతం తగ్గిపోతోంది. చిన్న చిన్న కంపెనీల్లో కూడా వినియోగించుకునే అవకాశాన్ని కల్పిస్తున్నాయి.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అంటే చాలా మంది ఓ పొరపాటు పడుతుంటారు. అవి అచ్చు మనిషిలానే ఆలోచిస్తాయని, మనిషి చేసే తప్పులు చేసే అవకాశం ఉందని, ప్రవర్తిస్తాయని. వారంతా అర్థం చేసుకోవాల్సిన విషయమేమంటే మనిషి పక్షిలా ఎగరడమంటే రెక్కలు కట్టుకుని.. వాటిని ఆడించుకుంటూ ఆకాశంలో తిరుగుతున్నాడా? కాదు కదా. అలాగే రోబోటిక్స్ కూడా ఆలోచిస్తాయి కానీ మనలా కాదు. మనకన్నా సునిశితంగా, నిర్దిష్టంగా, పక్కాగా అన్నా ఆశ్చర్యపోనవసరం లేదు. మనం ఓ విషయం గురించి లక్షలాది వెబ్ పేజెస్‌లో సమాచారాన్ని వెతికి, విశ్లేషించి సరైంది పట్టుకోలేము. ఒకరిగా కాదు వందల, వేలమంది కూడా రోబోటిక్స్ అవసరం లేకుండా ఆ పనిచేయలేరు. అంతర్జాలంలో ఏ విషయం గురించి మనం వెదుకుతున్నా మనం ఒక రోబోకి ఆ పని అప్పగిస్తున్నామన్న మాట. అలాగే సీటీ స్కాన్‌లోని ప్రతి మిల్లీమీటర్‌ను జల్లెడపట్టి క్యాన్సర్ కణాల జాడ మనం పట్టుకోలేము. ఆ పనికి రోబోటిక్స్ సాయం తప్పనిసరి. అంటే మనం మన పనుల్ని ఇప్పటి వరకు రోబోటిక్స్‌కు పూర్తిగా ఇవ్వలేదు. కోల్పోలేదన్న మాట. మనం చేయలేని, వల్ల కాని పనుల్నే అవి ఎక్కువగా ప్రస్తుతం నిర్వర్తిస్తున్నాయి.

150 ఏళ్ల క్రితం అసంభవం అనుకున్న పనుల్ని మనం తేలిగ్గా చేయగలుగుతున్నాం. ఓ సన్నని తీగెను బొడ్డు ద్వారా పంపి పంపి క్యాన్సర్ గడ్డలను తీసేయగలుగుతున్నాం. వివాహాన్ని వీడియోల్లో బంధించి ఆ తంతు ఎలా జరిగిందో మళ్లీ మళ్లీ చూడగలుగుతున్నాం. ఎక్కడో సుదూరాన ఉన్న అంగారకునిపైకి ఓ బండి పంపి ఇక్కడి నుంచి నడపగలుగుతున్నాం. మిత్రుడి నుంచి ఓ మెయిల్ అందుకుని అందులోని డిజైన్‌ను మన వ్యాపారానికి వాడుకుంటున్నాం. ఇలా కొన్ని లక్షలాది కొత్త విషయాల్ని చేయగలుగుతున్నాం. వాటిల్లో ఉద్యోగాల్ని పొందగలుగుతున్నాం. రోబోటిక్స్ విప్లవం కూడా అలాంటి ఊహకందని కొత్త వృత్తుల్లో మానవుణ్ని నిలపబోతున్నాయి. ఇప్పుడు మనం అనుకుంటున్న మన పనులు కాస్తా మనవి కాకుండా పోతాయి. అవి రోబోటిక్స్‌వి మాత్రమే అనే పరిస్థితి వస్తుంది. అప్పుడు మనకు వేరే ఏవో రోబోటిక్స్ చేయలేని పనులు రావచ్చు. ఇది యంత్రాలకు వ్యతిరేకంగా పనులు చేయడం కాదు ఇది యంత్రాలతో కలసి పనిచేయడం.

మనమూ మారాలి..

మరి ఇన్ని వృత్తులు, ఉద్యోగాల్ని రోబోలకు ఉన్నపాటున కోల్పోతే నిరుద్యోగ సమస్య మాటేమిటి. ఈ విషయాన్నే వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ (డబ్ల్యుఈఎఫ్) వంటి సంస్థలు హెచ్చరిస్తున్నాయి. బాగా అభివృద్ధి చెందిన ఎక్కువ స్థాయిలో యాంత్రీకరణ జరిగిన దేశాలే కాదు వస్తువుల ధరలు, డిమాండ్ వంటివి ప్రభావితం చేసి పేద, మధ్య తరగతి దేశాల్లోను రోబోటిక్స్ కార్మికులకు, ఉద్యోగులకు సవాల్ విసరనున్నాయి. ప్రపంచ సాంకేతిక శాస్త్ర మేధావి, నేటి తరపు ఐన్‌స్టీన్‌లా కీర్తించే ఇలాన్ ముస్క్, నేటికాలపు గ్రేటెస్ట్ సైంటిస్ట్ స్టీఫెన్ హ్యాకింగ్ మరికొందరు సాంకేతిక రంగ దిగ్గజాలు దేశ ప్రభుత్వాల్ని, అంతర్జాతీయ ఆర్థిక, వాణిజ్య సంస్థల్ని ఈ విషయంలో ఆచీతూచీ స్పందించాల్సిందిగా కోరారు. ముఖ్యంగా కృత్రిమ మేధ (ఏఐ) విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తూనే ఉన్నారు. సింగులారిటీ దశ దాటితే రోబోటిక్స్ తమకు, మనిషికి మధ్య ఏదో తేడా ఉందని పసిగడితే ప్రస్తుతం మనం చూస్తున్న జాతి వైరాలు, యుద్ధాల వంటివి రోబోలకు, మనుషులకు మధ్య తలెత్తే ప్రమాదం ఉందని అది క్రమంగా మనం వాటిని అదుపు చేయలేని స్థాయికి





చేరిపోతుందని హెచ్చరిస్తున్నారు. ఈ దశ రావడానికి చాలా కాలం పట్టవచ్చు కానీ రోబోటిక్స్ సాంకేతిక పరుగులకు పరిమితులు ఉండాలనే విషయం మాత్రం స్పష్టమవుతోంది. దాని కన్నా ముందు ప్రజల ఉద్యోగ భద్రత విషయంలో ప్రభుత్వాలు ముందుగానే మేల్కొని చర్యలు తీసుకోకుంటే సంక్షోభంలో పడే అవకాశాలు ఎక్కువగానే ఉన్నాయి. అందుకే భర్తీ కాబోయే రంగాల్లోకి రోబోటిక్స్‌ను వేగంగా దింపేయకుండా మనిషికి కొత్తగా వచ్చే అవకాశాలు, రంగాల్లోకి కుదురుకునే వీలు కల్పిస్తూ రోబోటిక్స్‌ను స్వాగతించాలి. జనాభా, అవసరాలను పోల్చుకున్నా కూడా చాలా కసరత్తులు చేయాలి. పోటీలో మనిషి గెలవలేడు కనుక రోబోలు పోటీకి రాని రంగాల్లోకి మెళకువల్ని, వృత్తుల్ని అభివృద్ధి చేసుకోవాలి. అదుపు ప్రభుత్వాల చేతుల్లోనే ఉంటే ట్రాన్సిషన్ సంతోషకరంగా, ఆమోదయోగ్యంగా ఉంటుంది. అంతటా యంత్రుడే ఉండి నడిపించే రోజుల్లో మనిషి ఇప్పటి అస్థిత్వాన్ని అవకాశాన్ని మిగుల్చుకోగలడని ఆశిద్దాం. మనిషికి భౌతికంగా కాకపోయినా కంప్యూటింగ్ ద్వారానైనా అమరత్వాన్నిచ్చే ఆల్టర్ ఈగో, ఇమ్మోర్టాలిటీ సాఫ్ట్‌వేర్‌ల రూపకల్పన జరుగుతోంది. మన స్పృహ (కాన్సియస్)ను రోబోటిక్స్‌లోకో, కంప్యూటర్లలోకో అప్‌లోడ్ చేసి వ్యక్తిని ఎప్పటికీ మిగిల్చే ఆలోచన చేస్తున్నారు. ట్రాన్స్‌హ్యూమన్, సైబోర్గ్, హైబ్రిడ్ ఇలా ఎన్ని మాటలు చెప్పినా మనిషి, యంత్రం అనుసంధానమయ్యే దశ భౌతికంగానే కాక మానసికంగాను సాధ్యమనే ఊహల్ని, ఆశల్ని రేకెత్తిస్తున్నాయి. వందేళ్ల క్రితం చంద్రుడు మీదకు మనిషి వెళతాడేమోననేది ఫిక్షన్ యాభై ఏళ్ల కిందటే నిజమైంది. ఇప్పటి ఫిక్షన్ అప్పుడు గ్రౌండ్ రియాల్టీ అవుతుంది. వెల్‌కమ్ అండ్ బీ రెడీ.

✦

22 ఏళ్లు వెతుకుతూ..



మన యెతీ గురించి తెలుసు కదా. ఆరడగుల పైనే ఎత్తుతో మనిషిని పోలినట్టుండే వింతైన పర్వత జీవి అది. అలాంటి దాన్నే బిగ్ ఫుట్ అని పశ్చిమ దేశాల్లో వెతికే ప్రయత్నం చేస్తున్నారు. ఉందో లేదో తెలీని ఇలాంటి మరో జీవే చైనా అడవుల్లో ఉందని నమ్ముతారు. దాని పేరు యెరెన్. చైనీస్ యెతీగా ప్రాచుర్యం పొందిన దీని గురించి జౌ పరిపాలన కాలం క్రీ.పూ. 1046-256 నుంచే అక్కడ చర్చ నడుస్తోంది. ఇదే ఇప్పటి జాంగ్ జియాంగ్సింగ్ అనే పెద్దాయన్ను షెన్నొంగ్జియా అడవుల్లో 22 ఏళ్లుగా మగ్గిపోయేలా చేస్తోంది. యెరెన్ కోసం వెతుకుతూ ఏడాదిలో పది నెలలు అడవుల్లో గడిపేస్తున్నాడు 62 ఏళ్ల జాంగ్. ఓ కెమెరా పట్టుకుని ప్రతి ప్రాంతాన్ని గాలిస్తున్నాడు. దాని ఆచూకీ కనుగొని ప్రపంచానికి చెప్పాలనే తీవ్ర కాంక్షతో సాధారణ జీవితానికి దూరమయ్యాడు. ఒంటరిగా కొండ, కోనల్లో గడిపేస్తున్నాడు. పెద్ద పాద ముద్రలకు సంబంధించిన 3 వేల ఫొటోల్ని, యెరెన్‌వి అని చెబుతున్న 100 వెంట్రుకల్ని సంపాదించాడని అంటున్నాడు. 19 సార్లు నేరుగా చూసే అవకాశం త్రుటిలో తప్పిపోయిందని బాధ పడుతున్నాడు. ఏదేమైనా దాన్ని అంతుపట్టనిదే అడవులు వదిలిరానని మొండి పట్టుదలకు పోతున్నాడు. జాంగ్‌లాంటి వ్యక్తులే కాదు ఏకంగా ఓ సంస్థే యెరెన్ ఆచూకీ కనుగొనే ప్రయత్నంలో ఉంది. 'ది వైల్డ్ మాన్ రీసెర్చ్ ఫౌండేషన్' దాదాపు 400 మంది స్థానికుల నుంచి యెరెన్‌కు సంబంధించిన ఆధారాలు సేకరించే కసరత్తు చేస్తోంది. కానీ, అక్కడి జంతు శాస్త్రవేత్తల్లో చాలామంది యెరెన్ అనేదో కట్టుకథ అని కొట్టిపారేస్తున్నారు. అయినా ప్రజల్లో ఉన్న ఆసక్తిని పర్యాటకాభివృద్ధికి వాడేసుకుంటోంది స్థానిక పర్యాటక శాఖ.

వింత లోకం

డిజిటల్ కూతురు

జపాన్‌కు చెందిన కళాకారులైన యుకా, తెరుయుకీ ఇషికావా భార్యాభర్తలు. వారికి ముచ్చటైన కూతురు టెల్యూకా కూడా ఉందని అందరికీ ఆమె చిత్రాన్ని చూపించారు. అందరూ భలే ఉందే మీ అమ్మాయి? అంటూ తెగ పొగిడేశారు. ఆ తర్వాత వాళ్లందరికీ ఓ షాకింగ్ విషయం తెలిసింది. నిజానికి ఆ చిత్రంలో ఉన్నది నిజమైన మనిషి కాదు. 3డి సీజీ వర్క్‌తో రూపొందించిన మనిషి రూపం. ఆమె వారి డిజిటల్ కూతురంటే ఉన్నపాటున నమ్మలేకపోయారు. కళ్లలోని సజీవత, ప్రతిబింబం, స్పష్టంగా కనిపిస్తున్న వెంట్రుకలు, ముఖం మీది చర్మం ఇవన్నీ వారిని అదో గ్రాఫిక్ మాయాజాలమంటే నమ్మనీయలేదు. ఇప్పుడీ రూపానికి కదలికలు కూడా ఇచ్చి ఓ ఫిల్మ్ కూడా రూపొందించే పనిలో ఉన్నారు. ఆమె సజీవం గా నడిచొచ్చినట్టు భావన కలుగుతుందట. ఈ ప్రాజెక్ట్ మీద వారేమీ తలమునకలై లేరు. ఏదో హాబీగా అప్పుడప్పుడు కంప్యూటర్‌పై పనిచేస్తున్నారంతే. గ్రాఫిక్స్‌ను కూడా సొంతంగా నేర్చుకున్నారు.

నడిస్తే డాలర్లు

చక్ మెక్‌కార్తీ గొప్ప నటుడవ్వాలని లాస్ ఏంజెలెస్‌కు వచ్చాడు. ఏదో అడపా దడపా అవకాశాలే గానీ పూర్తిగా పొట్ట నిండే మార్గం దొరకడం లేదు. నటనతో పాటు ఇంకేదైనా చేస్తేగానీ కుదరదని ఆలోచిస్తుండగా ఓ ఆలోచన తళుక్కుమంది. అక్కడ పెంపుడు కుక్కల్ని వ్యాహ్యాళికి, మార్నింగ్ వాక్‌లకు తీసుకెళితే డబ్బులిస్తారు. దానికి 'డాగ్ వాకర్స్' అనే పేరు కూడా పెట్టారు. వినడానికి గౌరవంగానే ఉన్నా అసలు పని కుక్కల వ్యర్థాల్ని తీసి డస్ట్‌బిన్‌ల్లో వేయాల్సి ఉంటుంది. అది తాను చేయలేడు అందుకే 'డాగ్ వాకర్' బదులు 'పీపుల్ వాకర్' అనే ఆలోచన చేశాడు చక్. మార్నింగ్ వాక్‌కు బద్ధకించే వాళ్లని, కొత్త ప్రాంతాల్లో నడిచేందుకు భయపడే వాళ్లని, లేదా మిత్రులు లేనివారి ఒంటరి నడకల్లో తోడుగా వస్తానని ఫ్లైయర్‌లు పంచి ప్రచారం చేశాడు. అంతే నాతో నడువు, నాతో నడువు అంటూ ఫోన్‌లొచ్చాయి. ఒక మైలు తమతో నడిచేందుకు 420 రూపాయలకు పైనే అవుతున్నా కూడా వాటిని చెల్లించేందుకు వెనుకాడటం లేదు. అప్పుడు అర్థమైంది చక్‌కు మార్నింగ్ వాక్ అంటే మామూలు విషయం కాదని. ఎక్కువ మంది ఆసక్తి చూపడంతో ఇప్పుడు తనతో పాటు ఐదుగురు పీపుల్స్ వాకర్స్‌ను నియమించి అంతోకొంతో సంపాదిస్తూ నెట్టుకొస్తున్నాడు. నటనను వదల్లేదులెండి.



జార్ఖండ్‌లోని ఓ గిరిజన గ్రామానికి వెళితే ఇంటి మీద పేర్లు కనిపిస్తాయి. అక్కడే కాదు ఏ ఇంటి ముందన్నా యజమాని పేరో, వారు ఇంటికి పెట్టుకున్న పేరో కనిపిస్తాయి కదా ఏంటీ అక్కడ ప్రత్యేకత అనుకుంటున్నారా. అక్కడ కనిపించేవి రెండు పేర్లు. ఒకటి ఆ ఇంటి దీపానిది మరోటి ఆ ఇంటి వెలుగుది. కుటుంబ సభ్యుల్లో తల్లీ, కూతుళ్ల పేర్లు అక్కడి ప్రతి ఇంటి మీద నిండుగా కనిపిస్తాయి. చిరునామాగా ఆ ఇంటి ఆడపిల్ల పేరు చెప్పుకుంటూ వెతకాలి. అదే అక్కడి ప్రత్యేకత.

జార్ఖండ్‌లోని లోహనగరి జమదేశ్‌పూర్ నుంచి 26 కిలోమీటర్ల దూరంలో ఉంది తిరింగి అనే గిరిజన గ్రామం. ఆ గ్రామంలో ఎక్కడ చూసినా ఇంటి మట్టిగోడలపై నేమ్‌ప్లేట్‌లో పూజా,

ఆ రెండు పేర్లు..

చాందినీ, సుజలా, పాయల్, ఫుల్‌మనీ, టుస్సు అని ఆడపిల్లల పేర్లు ఉంటాయి. తిరింగి గ్రామంలో 'మేరీ బేటీ.. మేరీ పెహచాన్' అనే కార్యక్రమం జరుగుతోంది. ఆ ఇంటి ఆడబిడ్డే వారి గుర్తింపు కావడానికి కారణం జమదేశ్‌పూర్ డిప్యూటి కలెక్టర్ సంజయ్ కుమార్. చత్తీస్‌ఘడ్‌లోని ఓ గ్రామంలో అమ్మాయి పేరున ఉన్న నేమ్‌ప్లేట్‌ను సీనియర్ అధికారి తన ఇంట్లో పెట్టుకున్నాడని ఆయన వార్తల్లో చదివారు. అందుకు కారణం ఆ అమ్మాయికి చదువులో మంచి స్కోర్ వచ్చిందట! వెంటనే ఆయన మదిలో 'మేరీ భేటీ మేరీ పెహచాన్' ఆలోచన మెదిలింది. దానిని అందరి సహకారంతో అమలు చేయగలిగారు. పూర్తి గిరిజన గ్రామమైన ఈ ఊళ్లో మొత్తం 90 ఇళ్లు ఉన్నాయి. ఇక్కడి ప్రజలంతా వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నారు. అక్కడి గిరిజనుల ఆచారంలో భాగంగా ఎక్కువగా ఇంటి గోడలపై వివిధ రంగులతో పెయింటింగ్ వేయబడి వుంటుంది. ఇప్పుడు పసుపు రంగు పట్టీలో నీలం రంగులో అక్కడి ఇంటి అమ్మాయిల పేర్లు మరింత ఆకర్షణను తెస్తున్నాయి. ఈ రంగులనే ఎందుకు ఎంపిక చేసుకున్నారంటే.. పసుపు రంగు ప్రకాశం (వెలుగు) శక్తి, ఆశావాదానికి ప్రతీకలు. నీలం రంగు అనేది ఆడపిల్లలు స్వేచ్ఛగా విహరించడం, గగనతలాన్ని అందుకునేంత ధైర్యాన్ని ఇస్తుందనే అర్థం. ఈ కార్యక్రమం అన్ని చోట్లా జరగాలని గ్రామపెద్ద ఉమేష్ సర్దార్ ఆశిస్తున్నారు. మూడేళ్ల క్రితం ఇక్కడి ఆడపిల్లలచే ప్రభుత్వ పాఠశాలల్లో "పహెలే పడాయి.. ఫిర్ విదాయి' (మొదట చదువు తర్వాతే అప్పగింతలు) అనే నినాదాన్ని ప్రచారం చేయించారు. దాని తర్వాత ఆ ప్రచారం దేశవ్యాప్తంగా వెలుగులోకి వచ్చింది. ఆడపిల్లల పట్ల వివక్ష తీవ్రంగా ఉండే ఆ ప్రాంతాల్లో ఈ తరహా మార్పు మిగతా పల్లెల్లోను మార్పు తెస్తోంది.

– అమల తిలారు

సర్పంచ్ అంటే..

గ్రామస్తులకు మెరుగైన నీటి, విద్యుత్, పారిశుధ్య, విద్యా వసతులు కల్పిస్తే వారి జీవితాల్ని గొప్పగా మార్చేయొచ్చని గొప్ప భవితను అందించవచ్చని ఓ నేత చెబుతున్నారు. ఆమె పేరు రీతూ పాండ్రమ్. నేతలెప్పుడూ ఆ మాటలే చెబుతారు కదా కొత్తేం ఉందని అంటే ఆమె అతి పిన్న వయస్సు సర్పంచ్. మాటలకే పరిమితమవకుండా ఊరి అభివృద్ధికి కృషి చేస్తోందీ 24 ఏళ్ల చత్తీసగఢ్ యువతి. సారాబహారా గ్రామ సర్పంచ్ అయిన రీతూ గిరిజనుల సంక్షేమానికి చేస్తున్న కార్యక్రమాలు అనుభవజ్ఞులను సైతం ఆశ్చర్యపరుస్తున్నాయి. అవసరార్థులకు ఉచిత విద్య అవకాశాన్ని అందించి పురోగతికి కృషి చేస్తోంది. మంచినీరు, పారిశుద్ధ్యంలో బాగా వెనుకబడిన ఆ గ్రామంలో వర్షపు నీటి గుంటలు, మురుగు పారుదల ఏర్పాట్ల వల్ల కొత్త కళ తెస్తోంది. రాయ్‌పూర్‌కు 225 కి.మీ.ల దూరంలో ఉండే ఆ గ్రామంలో 9 వేల మంది ప్రజలున్నారు. రీతూ బిలాస్‌పూర్‌లోని కేంద్రీయ విశ్వవిద్యాలయంలో పీజీ చేసింది. ఆ తర్వాత సివిల్స్ వైపు దృష్టి పెట్టింది. అయితే ముందుగా తన గ్రామ పరిస్థితిలో మార్పు తేవాలని 2015లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో పోటీకి నిలబడింది. రీతూ గురించి అప్పటికే ఊరి వారు గొప్పగా చెప్పుకునేవారు. తమ ఊరి నుంచి ఓ అమ్మాయి ఉన్నత చదువులు చదివి గర్వకారణమైందని ముచ్చట పడేవారు. వారి ఆప్యాయత అభిమానాలే రీతూను సొంతూరి బాట పట్టించాయి. రీతూ తండ్రి ఊధమ్ సింగ్ పాండ్రమ్ ఓ సామాన్య రైతు. తనకొచ్చే చాలీచాలని సంపాదనతోనే రీతూతో పాటు మరో ఇద్దరు పిల్లల్ని పై చదువులు చదివించాడు. అదే ఆ కుటుంబానికి, రీతూకు గౌరవం తెచ్చింది. రీతూను నమ్మిన ఊరివాళ్లు ఆమెను ఎన్నికల్లో గెలిపించారు.

న్యూజెర్సీకి చెందిన టామ్ టర్చిచ్ ఒక ప్రపంచ యాత్ర చేయాలనుకున్నాడు . వివిధ దేశాల్ని ఇదివరకే చుట్టొచ్చినా కాలి నడకతో ఖండాంతరాలు దాటాలనుకున్న ఈ యాత్ర వెనుక ఒక బలమైన కారణముంది. తన మదిలో తట్టిన ఈ ఆలోచనే 'ది వరల్డ్ వైడ్ వాక్'కి కార్యరూపం దాల్చించి. గత సంవత్సరం ఏప్రిల్ 2న మొదలు పెట్టిన తన ప్రపంచ యాత్రలో టామ్‌కి పెంపుడు కుక్క తోడైంది. కొత్త నేస్తం సవన్నాతో ట్రెకింగ్, మౌంటెనింగ్ వంటి సాహసాలు చేస్తూ కాలినడకన రోజుకి పదిహేను మైళ్లు ప్రయాణిస్తున్నాడు. తన అనుభవాల్ని పదిలపరుచుకుంటూ పెంపుడు జంతువులతో హాయిగా యాత్ర చేయాలనుకునే వారికి తన బ్లాగ్ ద్వారా సూచనలందిస్తున్నాడు టామ్.

కాలి నడకన ఏడు ఖండాలు



స్నేహితులు తోడుంటే ఎలాంటి కష్టాన్నయినా ఎదిరించగలం అనే మాట మనం ఎక్కువగా వింటుంటాం. టామ్ జీవితంలోనూ ఎంతో మంది మిత్రులు, చిలిపి చేష్టలు, చిన్న చిన్న గొడవలు, నేస్తాలతో సరదా సాయంత్రాలు. ఇలా హ్యాపీగా తన టీనేజ్ లైఫ్ ఎంజాయ్ చేస్తున్న టామ్‌కి ప్రాణ స్నేహితురాలు అన్నే మారియా(17) మరణం కలచివేసింది. జీవితంలో ఏదీ స్థిరత్వాన్ని కలిగుండదనిపించిందితనికి. అందుకే వివాదాలు, గొడవలతో కాలం గడిపేయకుండా తనకి అసలు పరిచయంలేని ప్రదేశాల్ని చుట్టేస్తూ కొత్త మిత్రులని పోగేసుకోవడం ప్రారంభించాడు. కాలినడకన సాగే ప్రయాణాలే కాదు కొత్త ప్రదేశాల్లో సాహసయాత్రలు తనకు కొత్త స్ఫూర్తినిచ్చాయి. టెక్సాస్ చేరుకున్నాక తనకి పరిచయమైంది సవన్నా. ఈ శునకాన్ని తనతో పాటు ప్రపంచ దేశాలూ తిప్పేస్తూ కొత్త అనుభూతుల్ని మదిలో పదిల పరుచుకుంటున్నాడు. తను చేరుకునే ప్రతి ప్రదేశంలోనూ పాత మిత్రులని కలవడం తప్పనిసరి. వారి సాయంతో అక్కడ పేరొందిన ప్రదేశాలతో పాటు కొత్త ప్రంతాల్నీ చుట్టిరావడం అలవాటు చేసుకున్నాడు టామ్.

ఎత్తైన కొండలు చుట్టూ పచ్చని పచ్చిక బైళ్లతో మధ్య అమెరికాలోని కరీబియన్ సముద్ర తీర ప్రాంతంలో ఎంతో అందమైన ప్రదేశం కోస్టారికా. పర్యాటకుల మనసు దోచుకునే కోస్టారికాతో తన తొలి ప్రయాణం మొదలైంది. కోస్టారికాలో తన మిత్రులని కలసి అక్కడ అందమైన ప్రదేశాలన్నీ చుట్టొచ్చాడు టామ్. గతంలో ఒక ఆర్టికల్ ద్వారా గ్రెనడ గురించి తెలుసుకోవడంతో కోస్టారికా నుండి స్పెయిన్‌కి చేరుకున్నాడు. మధ్య అమెరికా ప్యారిస్‌గా పేరొందిన గ్రెనడలో మధ్యయుగం నాటి కట్టడాలు, పర్వతాలపై ఏర్పడ్డ అడవులు, జలపాతాలే కాదు నగరంలో నిర్మించిన రెస్టారెంట్ల నిర్మాణాలన్నీ ప్రత్యేకంగా ఉంటాయి.



టామ్

గ్రెనడలో హాస్టల్‌లో బస చేయాలనుకున్నా తనకి సంబంధించిన వస్తువులని ఉంచిన చిన్న కార్ట్, పెంపుడు కుక్కని హాస్టల్ సిబ్బంది అనుమతించకపోవడంతో వసతి కోసం ఎక్కువ డబ్బునే వెచ్చించాల్సొచ్చింది. మరుసటి రోజు ఉదయం గ్రెనడ వీధుల్లో ప్రయాణం మొదలు పెట్టాడు టామ్. గ్రెనడలో అచ్చమైన స్పానిష్‌లో మాట్లాడుకునే వారు అరుదుగా ఉంటారనుకునే సమయంలోనే స్పానిష్‌లో మాట్లాడుతూ కనిపించింది ఒక అమ్మాయి. ఒక్క నిమిషం ఆమెని చూసి ఆశ్చర్యపోయాడు టామ్. తనో బ్యాక్‌ప్యాకర్ కావడంతో స్పానిష్‌లో తనతో కొంత సేపు సంభాషించాడు. గ్రెనడ నగర వీధుల్లో ఇంటి నిర్మాణాలని చూసిన తర్వాత నిజమైన అందం అదే అనిపించిందతనికి. పది అడుగుల ఎత్తున చెక్కిన చెక్క తలుపులు, భారత్‌లోని పెంకుటిళ్లని పోలిన ఇంటి పైకప్పులు, వెడల్పాటి చుట్టుగోడలు, విభిన్నమైన రంగుల్ని అద్దుకున్న ఆ నిర్మాణాలన్నీ గ్రెనడ పట్టణానికే ఎంతో వన్నె తెచ్చేవిగా అనిపించాయి. ఆ ఇళ్లన్నీ ఒక పల్లెటూరి వాతావరణాన్ని తలపించడం తనని ఆశ్చర్యానికి గురిచేసింది. సాయంత్రానికి హోటల్ రూమ్ చేరుకున్న టామ్‌కి సవన్నా కూడా అలసటగా కనిపించింది. తన పెంపుడు కుక్కకీ షవర్ అందించాడు. సవన్నా తన వద్దకి వచ్చిన తొలినాళ్లలో స్నానం చేయిస్తుండగా టామ్‌ని



గాయపరిచి పారిపోడానికి ప్రయత్నించేది. ఇపుడు టామ్‌తో మైళ్లకు మైళ్ల ప్రయాణం చేయడం మొదలు పెట్టాక సాయంత్రానికి షవర్ అలవాటైపోయింది సవన్నాకి.

పచ్చదనంలో మనసు చిక్కి...

మధ్య అమెరికాలోని ఎత్తైన ప్రాంతం హోండురాస్. అక్కడ హోటల్‌పై అంతస్తు నుండి హిల్ వ్యూ మనసుని హత్తుకుంటుంది. అప్పటి దాకా ఎత్తైన కొండల్ని పరిశీలిస్తున్న టామ్‌కి చల్లటి పైరుగాలి తగలడంతో అక్కడున్న పంట పొలాలపై ఒక్కసారి దృష్టి మళ్లింది. ఇక ఆ దృశ్యాలన్నీ తన కెమేరాల్లో బంధించేందుకు పయనమయ్యాడు టామ్. కనుచూపు మేరలో అన్నీ పచ్చటి పొలాలే. అక్కడక్కడా చెక్కతో నిర్మించిన ఇళ్లు మాత్రమే కనిపిస్తాయి. పచ్చటి పొలాల మధ్య ఏర్పరిచిన ఒక చిన్న రోడ్డు మార్గం నుండి ఆ ప్రదేశమంతా కలియతిరిగి సాయంత్రానికి తన హోటల్ రూమ్‌కి చేరుకున్నారిద్దరూ. సిటీ లైఫ్‌కి దూరంగా పంటపొలాలు, పాడి ఆవులు, చల్లని గాలులు మధ్య సేదతీరిన ఆ అనుభవాలన్నిటినీ తన బ్లాగ్‌లో పొందుపరిచాడు టామ్. పర్యాటక ప్రాంతంగా పేరొందిన పెరూలో ఎప్పటికప్పుడు మార్పులు చోటుచేసుకుంటాయి. అక్కడి చారిత్రిక కట్టడాలకి నిలువెత్తు నిదర్శనంగా ఉంటుంది మచూ-పిచూ. అక్కడ పేరొందిన ఒక నగరం కస్కో. పెరూకి సంబంధించిన వివిధ రకాల ఆహార పదార్థాలతో ఇక్కడ పెరూవియన్ ఫెయిర్(సంత)ని నిర్వహిస్తుంటారు. మంచు పిచుకి ఏటా అధిక సంఖ్యలో సందర్శించే టూరిస్టులు కస్కోకి చేరుకుని ఈ ఫెయిర్‌లో పాల్గొంటారు. టామ్ తన చిన్ననాటి మిత్రుడు జూలియన్‌తో కలిసి పెరూ వంటకాలని రుచి చూశాడు. మాచూ పీచూలో ప్రకృతి అందాలతో పాటు రకరకాల వలస పక్షులూ సందర్శకుల్ని ఆకట్టుకుంటాయి. వాటికోసమే జూలియన్ ఆ ప్రదేశానికి చేరుకున్నాడు. పక్షి ప్రదర్శన శాలల్లో ఉంచే పక్షుల కంటే ఇక్కడి పంట పొలాల్లో ఎన్నో రకాల పక్షులు వాలిపోతుంటాయి. వాటిని చూసేందుకు ఇద్దరూ దగ్గరలోని ఒక పొలానికి వెళ్లి అక్కడ పాతి ఉన్న ఒక కర్రపై ఒక తెల్లటి వస్త్రాన్ని ఉంచాడు జూలియన్. పక్షుల్ని ఆకర్షించేందుకు ఉపయోగించే ఒక పద్ధతి ఇది. దీని ద్వారా తనకిష్టమైన (వడ్రంగి పిట్ట జాతికి చెందిన) యాండీన్ కండర్‌ని దగ్గరగా వీక్షించారు. టామ్‌కి గాటిమరా పరిచయమయ్యాడు షేన్. టామ్, జూలియన్ ఇద్దరూ షేన్ కోసం ఒక కాఫీ షాప్‌లో ఎదురుచూడడం మొదలెట్టారు. తనో ప్రముఖ సైక్లిస్ట్. కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న షేన్ కొంత కాలం సేద తీరేందుకు కస్కో చేరుకుంటున్నాడని తెలిసి అతన్ని

కలవాలనుకున్నాడు టామ్. కొంత సేపటికి షేన్ కూడా కాఫీషాప్‌కి చేరుకున్నాడు. వీళ్ల ముగ్గురూ మాటల్లో మునకలేస్తుంటే తను గీసిన చిత్రాలని చూడమంటూ ఒక వ్యక్తి తన వద్ద ఉన్న పెయింటింగ్స్‌ని వారికి అందించాడు. సాంప్రదాయ ఊలు వస్త్ర ధారణలో ఉన్న పెరూ యువతి చిత్రంతో పాటు, కోబుల్ రాతి మార్గాలు,తెల్ల వర్ణ చిత్రాలు పెరూ ప్రాచీన నాగరికత జార్జ్ గీసిన చిత్రాల్లో ఉట్టిపడుతోంది. తనో ఆరితేరిన చిత్రకారుడు కాకపోయినా జార్జ్ గీసిన చిత్రాలు అందరినీ ఇట్టే అకట్టుకున్నాయి. నలభై డాలర్లకు రెండు పెయింటింగ్స్ ఖరీదుచేశాడు టామ్.

ఎత్తైన శిఖరాలు, విస్తారమైన పీఠ భూమిని కలిగుండే ఒక కొండ ప్రాంతం పెరామొ. కొండ చివరి భాగంలోని ఒక ప్రదేశంలో తన గుడారాన్ని ఏర్పరుచుకున్నాడు టామ్. ఆల్పైన్ వృక్షాలు, పొడవైన గరిక మొక్కలు బలంగా వీచే గాలుల నుండి తన గుడారాన్ని కాపాడుతున్నాయి. ఆ పర్వత శ్రేణిని రెండుగా విభజిస్తున్న యాండియన్ జార్జ్ పర్వతం ట్రెకింగ్‌కి అనుకూలమైన ప్రదేశం. పర్వతాల మధ్య నుండి ఇరుకైన దారులు ఉండటంతో ఇక్కడ ప్రయాణం కొంత ప్రయాసతో ముడిపడి ఉంటుంది. అప్పటికే చీకటి పడడంతో టామ్ ఆ రాత్రికి అక్కడే సేద తీరాలనుకున్నా బలంగా వీస్తున్న చల్లగాలుల మధ్య సవన్నాకి రక్షణ కల్పించడం టామ్‌కి కష్టమైంది. ఎనర్జీ డ్రింక్స్‌తో టామ్ ఆ పూట గడిపినా చుట్టుపక్కల ఎక్కడా నివాసాలు లేకపోవడంతో సవన్నాకి ఆహారం అందించలేకపోయాడు టామ్. చలికి తట్టుకోలేక పోవడంతో తన వెంట తెచ్చిన కార్ట్‌లోకి దూకి సేదతీరింది సవన్నా. ఇలాంటి ప్రతికూల వాతావరణంలో పెంపుడు జంతువులకి ఇబ్బంది కలిగించకుండా తగినచర్యలు తీసుకోవడంతో పాటు టామ్ తన ప్రయాణంలో సవన్నాకి అనుకూలమైన ప్రాంతాల్ని ఎంచుకుని తన ప్రపంచ యాత్ర కొనసాగిస్తున్నాడు.

-అద్దేపల్లి శర్వాణి



కవిత్వమ్

వీధి బాలుడు

అతడు అయోనిజ బిడ్డకాదు
అమ్మ నాన్నలు కన్నబిడ్డ
ఏ తల్లి జారవిడుపో
ఏ తండ్రి పారవేతో
వీధి బాలుడై నిలిచాడు
ఫల్గుణ విజయ పార్థ కిరీటి
అర్జునుడి అనేక బిరుదుల్లా
కర్రోడు జుట్టోడు బక్కోడు
అతణ్ణి వరించిన నామధేయాలు
అన్ని జన సందోహాల్లో అతడే
ప్రపంచానికి అతడు భిక్షకుడు
ప్రపంచం అతనికి యాచకశాల
చార్మినార్ ట్యాంక్ బండ్
అమరావతి ఏడుకొండలు
కాదేదీ భిక్షకనర్హం!
బడిలేదు బాధ్యతలు లేవు
బంధాలులేవు అనుబంధాలు లేవు
పొట్ట నింపుకునే ప్రక్రియలో పలువిద్యలు
కాలే కడుపు చెత్త కాగితాల్ని సేకరిస్తుంది
భవన నిర్మాణాలు
బాలకార్మికుల్ని ఆహ్వానిస్తాయి!
చినిగిన చొక్కాను చీపురు చేసి
రైలింటిని చిమ్మాక
నిగ నిగ లాడే నట్టింటిని చూసి
ఆగినరైలు హుషారుగా కూతవేస్తుంది
అర్థించిన అరచేయి మూకుట్లో
రాలిన కాసుల్ని లెక్కిస్తూ
పయనం ప్లాట్‌ఫారంపై మజిలీ చేస్తుంది!
నిండు కుండలా వున్న బస్సులో
బావా ఎప్పుడు వచ్చితీవు
కృష్ణ పరమాత్ముడై పద్యం ఎత్తుకోగానే ప్రయాణీకులు
తన్మయత్వంతో
అసంకల్పితంగా దాన కర్ణులౌతారు
జేబు నిండిన అతడు
దారిలేని చోట దిగి
దారేసుకుంటూ మాయమౌతాడు!
మూసిన గేటు పక్కన
ఆగిన కార్ల అద్దాలపై
అతడి చేతులు పరిశ్రమిస్తే
అద్దం మెరుపులు చూసిన యజమాని
అర్థించిన దోసిట్లోకి నాణెం విసురుతాడు
రైలు గేటు దాటక ముందే అతడు
గేటు దాటి అదృశ్యమౌతాడు!
చిరునామా లేని పౌరుడతడు!
చనిపోయాకే గుర్తు తెలియని శవం అతడు
మానవత్వం ఒడిలో తప్పిపోయిన బిడ్డ అతడు
నా తలపుల్లో చెరగని జ్ఞాపకం అతడు!

- అడిగోపుల వెంకటరత్నమ్
9848252946

గద్ద రెండో జీవితం

'ది రీబర్త్ ఆఫ్ ది ఈగల్' అంతర్జాలంలో ఈ వీడియో చూస్తే మీకో గొప్ప జీవిత పాఠం తెలుస్తుంది. పక్షి జాతిలో ఎక్కువ జీవిత కాలం గద్దదే. అది 70 ఏళ్లు బతకగలదు. కానీ 40 ఏళ్ల వయసు వచ్చేప్పటికే శారీరకంగా చాలా దెబ్బతింటుంది. ఏళ్ల తరబడి సాగించే వేటే దానికి ముప్పుగా మారుతుంది. ఆహారాన్ని ఒడిసి పట్టుకునే వాడీ గోళ్లు బలహీనమైపోతాయి. దేన్నైనా పొడుచుకు తినగలిగే ముక్కు మరీ వంకీ తిరిగి నోటిలోకి ఆహారాన్ని తీసుకోలేకపోతుంది. బరువాటి రెక్కలు పాడైపోయి ఈకలు మందంగా మారి సరిగా ఎగరలేకపోతుంది. ఇలా శారీరిక మార్పులు వేటాడేందుకు పనికి రాకుండా చేస్తాయి. అప్పుడు గద్దకు రెండే అవకాశాలు. ఒకటి ఆకలితో కృశించి చనిపోవడం. రెండు ఏ పక్షి చేయనటువంటి తీవ్ర మార్పుల్ని స్వయంగా చేసుకోవడం. అదో కఠిన నిర్ణయం. అతి బాధాకరమైన, తీవ్ర నొప్పిని కలిగించే చర్య. 150 రోజుల పాటు సాగే వర్ణనాతీతమైన వేదనను అనుభవిస్తూనే మరో కొత్త జీవితానికి తనను తాను సిద్ధం చేసుకుంటుంది. ముందుగా గద్ద పర్వతంపైకి చేరుకుంటుంది. అక్కడో గూడు కట్టుకుంటుంది. అదే పనిగా తన ముక్కును రోజుల తరబడి రాళ్లకు రాసుకుంటుంది. అలా మొత్తం ఊడిపోయేంత వరకు చేస్తుంది. వారాల తరబడి మళ్లీ ముక్కు ఏర్పడే వరకు వేచి చూస్తుంది. కొత్తగా వచ్చిన ముక్కుతో తన కాలి గోళ్లను పీకేసుకుంటుంది. కొత్త గోళ్లు వచ్చేంత వరకు వేచి చూస్తుంది. వాటితో తన ఒంటికి బరువుగా ఉన్న ఈకల్ని పెరికిస్తోంది. అలా 5 నెలల తర్వాత పూర్తిగా కొత్త రెక్కలు వచ్చాక పర్వతం శిఖరం నుంచి రివ్వున గాల్లోకి ఎగురుతుంది. మునపటిలా తన వేట కొనసాగిస్తుంది. అలా మరో 30 ఏళ్ల జీవితాన్ని పెంచుకుంటుంది. ఇదంతా చదివితే ఏమనిపిస్తోంది. మనల్ని కూడా తీవ్ర సమస్యలు దెబ్బతీస్తాయి. మళ్లీ జీవితం లేదనిపిస్తాయి. అప్పుడు మనకు రెండు అవకాశాలు కనిపిస్తాయి. ఒకటి చావు.. రెండు మార్పుచేర్పులు. పాత చేదు గురుతుల్ని, అలవాట్లని, పద్ధతుల్ని, ఆలోచనల్ని వదులుకోవాలి. అప్పుడు మనమూ గద్దలా రివ్వున దూసుకువెళతాం.. మరో జీవితానికి.

నగరాల్లో వాహనాల ద్వారా వెలువడే కాలుష్యంలో దాదాపు 14 శాతం కాలుష్య కారకాలు కార్ల ద్వారా వెలువడుతున్నట్లు కొన్ని నివేదికలున్నాయి.

1956లో నెదర్లాండ్స్, బెల్జియంలలో నవంబర్ 25 నుండి జనవరి 20 వరకు మొదటి ఆదివారాన్ని కార్ ఫ్రీ డేగా పాటించేవారు .

కార్ల ద్వారా జరుగుతున్న ప్రమాదాలు, పర్యావరణ పరిరక్షణ దిశగా, ప్రపంచదేశాల్లో సెప్టెంబర్ 22న కార్ ఫ్రీ డేని నిర్వహిస్తున్నారు.

వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు ఆ రోజు నడక లేదా సైకిల్స్‌ని ఉపయోగించడంతోపాటు అవగాహనా సదస్సుల్ని నిర్వహిస్తారు.

ఆ ఒక్క రోజు...

కార్ల వాడకంతో అధికంగా వెలువడుతున్న పొగ ద్వారా కార్బన్ మోనాక్సైడ్ ఉద్గారాలు. ఆమ్ల వర్షం, పొగ మంచు, వాయు కాలుష్యాలని కలిగిస్తున్నాయి.

ప్రపంచ వ్యాప్తంగా ఈ ఏడాది 10కోట్ల మంది కార్ ఫ్రీడేని పాటిస్తున్నారు.

ప్రపంచ వ్యాప్తంగా 1500 నగరాలు, 40 దేశాల్లో కార్ ఫ్రీ డేని పాటిస్తారు.

కార్ల నుండి అధికంగా వెలువడే కార్బన్ మోనాక్సైడ్ కారణంగా నాడీ వ్యవస్థ, గుండె పనితీరు, రక్తంలో ఆక్సీజన్ ప్రవహించే స్థాయికి ఆటంకంగా మారుతుంది. ఇవి క్యాన్సర్, గుండె జబ్బులు, ఆస్తమా వంటి శ్వాస కోశ వ్యాధులకి దారి తీస్తున్నాయి.

ఆస్ట్రియా, స్విట్జర్లాండ్, ఫ్రాన్స్ దేశాల్లో ట్రాఫిక్ సమస్యల వల్ల సంభవించిన మరణాల కంటే దీర్ఘకాలంగా కార్ల ద్వారా చోటుచేసుకున్న వాయుకాలుష్యం కారణంగా ఏటా 21,000 మంది మరణిస్తున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ స్పష్టం చేసింది.

కార్ యాక్సిడెంట్‌ల కారణంగా ప్రపంచవ్యాప్తంగా 50వేల నుండి 80 వేల మంది చనిపోతున్నారు.

ఇండోనేషియా రాజధాని జకార్తాలో సెప్టెంబర్ మొదటి ఆదివారం కార్ ఫ్రీ డే ని నిర్వహిస్తారు.

కథ

నరసింహా సామిల్

- దాసరి శివకుమారి
9866067664



రావు కాలేజ్ నుండి కారు డ్రైవ్ చేసుకుంటూ వస్తున్నారు. దూరంగా చేతిలో చిన్న సంచి పట్టుకుని నిలబడి వున్న వ్యక్తి రోడ్డు వారగా కన్పించారు. నరసింహం మాస్టారే. వయసు పైబడటం వలన కాస్త బలహీనంగా కన్పిస్తున్నారు. రావు కారు పక్కకు తీసి ఆపి మాస్టారు దగ్గరకు వెళ్లారు. "నమస్తే మాస్టారు! ఎలా వున్నారు? ఆరోగ్య మెలా వుంటుంది?"

"నీవా? అనుకోకుండా కనిపించావు రావ్, చాలా సంతోషం. నువ్వు కులాసాయే గదా?"

ఈ మధ్యే రావు బ్యాచ్ విద్యార్థులంతా కలిసి తాము చదివిన స్కూల్లో ఫంక్షన్ జరుపుకున్నారు. ఇటీవలే కలిసారు కాబట్టి మాస్టారు త్వరగా పోల్చుకోగలిగారు. ఆయన చేతిలో మెడికల్ రిపోర్టుల కవరు పెద్దగానే కనిపిస్తున్నది. మందు బిళ్లలు పెట్టిన అట్ట పెట్టె కూడా ఉబ్బెత్తుగా వుండి కవరులోంచి తొంగి చూస్తున్నది.

"హాస్పిటల్ కెళ్లొస్తున్నట్లున్నారు. ఏమైనా ఇబ్బందా మాస్టారు?"

"సమ్ ప్రాబ్లమ్స్ ఆర్ ఫిజికల్, ఆల్ ప్రాబ్లమ్స్ ఆర్ మెంటల్." అంటూ సన్నగా నవ్వారు.

మాస్టారెప్పుడూ అంతే. సరళంగా, అందంగా మాట్లాడటం ఆయన సొంతం. తమకు ఇంగ్లీషు బోధించేటప్పుడు ఎంతో బాగా చెప్పేవారు. తాను బోధనాంశంలో మమేకం అయిపోయేవారు. విద్యార్థులందరినీ తనతో పాటు, సబ్జెక్టులో లీనం చేసేవారు. ఆనాడు మాస్టారు లాంటి వాళ్లు తమకు ఆంగ్ల వ్యాకరణం బోధించబట్టే ఈనాడు వ్యాకరణ దోషాలు లేని ఇంగ్లీషు భాషను తాము ఉపయోగించగలుగుతున్నారు.

"రోడ్డు మీద నిలబడ్డారేమిటి మాస్టారు? ఎవరి కోసమైనా ఎదురుచూస్తున్నారా?"

"హాస్పిటల్లో చూపించుకున్నాను. మందుల షాపు దగ్గర బాగా రద్దీగా వుంది. ఒక అరగంట టైమ్ పడుతుంది. మీరు మందులు తీసుకుంటూ వుండండి.. నేనీలోగా టౌనులో చిన్న పని చూసుకుని వస్తానని మావాడు బయటికి వెళ్లాడు. నేను షాపు నుంచి వచ్చి వాడి కోసం చూస్తున్నాను."

"సరే రండి మా ఇంటికెడదాం. ఇక్కడకు దగ్గరే. ఫోన్‌చేసి మీ అబ్బాయికి మా ఇంటి అడ్రసు చెబ్దాం. వచ్చి మిమ్మల్ని తీసుకెళతాడు. కాస్త విశ్రాంతి తీసుకుని వెళ్లొచ్చు" అంటూ ఒత్తిడి చేస్తే నరసింహగారు కారెక్కి కూర్చున్నారు. తనకు తీసిన ఎక్స్‌రే, స్కానింగ్ రిపోర్టులు అన్నీ కవరులో నుంచి తీసి చూపించారు. "మెంటల్ టెన్షన్ బాగా తగ్గించుకోమని చెప్తున్నారు డాక్టర్లు. దానిమూలంగానే బి.పి. పెరుగుతుంది. అప్పుడప్పుడూ కళ్లుతిరిగి పడిపోవటం కూడా జరుగుతుంది. అలాంటి స్థితిలో తలకు దెబ్బతగలకుండా జాగ్రత్తగా వుండాలని చెప్తున్నారు. తలేముంది ఎక్కడ తగిలినా ఈ వయసులో ఇబ్బందే. ఇది ఎండోస్కోపీ రిపోర్టు. పొట్టలో నాలుగైదు అల్సర్స్ వున్నాయి. మందులతో పాటు మద్యపానాలు పాటించండి. త్వరగానే తగ్గుతాయి అని చెప్తున్నారు. మీ ఆహారపు అలవాట్లు అన్నీ బాగున్నాయి. అయినా అల్సర్స్ వచ్చాయంటే మీరు బాగా ఒత్తిడి కి లోనవుతున్నారు. ఎక్కువ ఆలోచించకండి. టెన్షన్ అసలే వద్దు అంటున్నారు.మాస్టారు నిరుత్సాహంగా.

"ఈ వయసులో అనారోగ్య సమస్యలు దాదాపు అందరికీ వుంటున్నాయి. తగ్గిపోతాయిలే మాస్టారూ. బాధపడకండి. ఈ మధ్య పేపర్లో చూశాను. ప్రసాదుని గురించిన వార్త. దాని గురించేనా మీ ఆలోచనలన్నీ?"

"అసలిదంతా ఎలా జరిగింది? మీరు ప్రసాద్‌ను కట్టడి చేయలేదా? అని కొందరంటున్నారు. ఇది పెద్ద పట్టించుకోవాల్సిన విషయమే కాదని మరికొందరంటున్నారు. కానీ నేనలా సరిపెట్టుకోలేకపోతున్నాను. జనం మధ్యకు రావాలంటే ఇబ్బందిగా వుంటున్నది. నేను నీతి నియమాలు, నైతిక విలువలు పాటిస్తూ మీకంద అవే నేర్పాను. నా ఇద్దరు పిల్లల్నీ అలాగే పెంచాను. కాని పొరపాటు ఎక్కడ జరిగిందో అర్థం కావటం లేదు. ప్రసాదు ఎంత లోతున ఊబిలో కూరుకుపోతాడో ఊహకందంకుండా

వున్నది."

"ప్రసాద్ చేసే వ్యాపారమేంటి? ఎర్ర చందనం దుంగలు తన దగ్గర ఎందుకున్నాయి."

"వాడు బి.కాం పూర్తి చేశాడు. ఎంకామ్ చెయ్యి, లేదా సి.ఎ చదవాటానికి ప్రయత్నించమన్నాను. ఉద్యోగాల మీద ఇంట్రెస్టు లేదు. ఏదైనా బిజినెస్సు చేస్తానని అన్నాడు. చెరుకుపల్లి బస్టాండు దగ్గర్లో కలప అడితీలు వున్నాయి. చుట్టుపక్కల ఊళ్ల నుంచి తాటి బొందలు తీసుకొచ్చి వాసాలుగా కోయించి అమ్ముతూ వుంటారు. తెలిసిన వాళ్లెవరో అమ్మేస్తున్నారని ఒక అడితీ కొన్నాడు. ఇప్పుడంతా ఇళ్లు, అపార్ట్‌మెంట్‌ల నిర్మాణం ఎక్కువగా జరుగుతుంది కాబట్టి కలపకు మార్కెట్లో డిమాండు పెరిగింది. భద్రాచలం దగ్గర చింతూరు వెళ్లి ఆక్షన్‌లో టేకు దుంగలు పాడేవాడు. వాటిని లారీలో వేసుకుని తన అడితీకి చేర్చుకుంటూ వుండేవాడు. నారాయణ అనే వ్యక్తి టేకు వేలం పాట దగ్గర పరిచయమయ్యాడట. తను రోజ్‌వుడ్ కలప పాడుకున్నానని మీ లారీలో ఖాళీ వున్నది కాబట్టి నా దుంగలు కూడా వేసుకొస్తే లారీ బాడుగ షేర్ చేసుకోవచ్చని చెప్పాడట. అలాగేనని వాళ్ల దుంగలు పొన్నూరులో దింపి తన టేకును చెరుకుపల్లి తెచ్చుకున్నాడు. మరొకసారి రాజవొమ్మంగి వెళ్లాడు. ఆ దగ్గర్లో దొరికే మద్ది, ఏగిస దుంగలు వేలంలో పాడుకొచ్చాడు. అక్కడ కూడా ఈ నారాయణ కలిశాడు. తన వద్ద చంద్ర మొద్దులున్నాయి.. మీ వాటితో కలిపి తెచ్చి పెట్టండి. వాటిని ఈసారి పొన్నూర్‌లో దింపవద్దు. చెరుకుపల్లి తీసుకెళ్లి మీ అడితీలో వెయ్యండి. తర్వాత నేనే వచ్చి వీలును బట్టి చేర్చుకుంటానని చెప్పాడట. మావాడు అలాగే చేశాడు. ఆ చంద్ర మొద్దుల్ని ఒక పక్క విడిగా వేయించాడు. పదిహేను రోజులు గడిచాయి. ఒకరోజు రాత్రిపూట ఆ నారాయణ మా వాడికి ఫోన్ చేసి అడితీ దగ్గరకు వచ్చి తన చంద్ర మొద్దుల్ని ఇవ్వమన్నాడట. మా వాడు అలాగే వెళ్లాడు. అతడి కలపను అతడికప్పగించాడు. వేరే కలపతో వున్న లారీతో వచ్చి ఈ మొద్దుల్ని కూడా సర్దించుకున్నాడట. ఈ పదిహేను రోజులూ దాచి వుంచినందుకు పదివేలు ఇచ్చాడు. ప్రసాద్‌గారూ! మీరెక్కడైనా కలప కొనేందుకు వెళితే నాకు ఫోన్ చేయండి.. ఇద్దరం కలిపి తెచ్చుకుందామని చెప్పాడు. మరొక చిన్నమాట 'నేను విడిగా ఏదైనా కలప తెచ్చుకుంటే మీ అడితీలో కొద్దిరోజులు దాచుకుంటాను. దానికి నేను బాడుగ చెల్లిస్తాను. ఇప్పుడు ఇచ్చినట్లుగానే' అన్నాడు.

అతను అడిగిన దానికి పెద్దగా ఆలోచించాల్సింది ఏమీ కన్పించలేదు ప్రసాదుకు. తరచూ ప్రసాద్ వ్యాపార విషయాలు కనుక్కుంటూనే వుంటాను. తను కలప కొనుగోళ్లకు గానీ వేరే పనుల మీద గాని పొరుగూళ్లకు వెళ్లినప్పుడు నేను అడితీలో కూర్చుని పనివాళ్ల సహాయంతో పనులు చక్కపెడుతూ వుంటాను. నారాయణ విషయంలో నాకు అనుమానం వచ్చింది. కొద్ది రోజులు కలప దుంగలు వుంచితే అంతంత మొత్తాలు బాడుగ్గాను, అద్దెగానూ ఇవ్వటమేమిటని! అని అడిగితే ప్రసాద్ మాత్రం కొట్టి పారవేశాడు. 'అడితీ అద్దెలు మాత్రం తెలిగ్గా వున్నాయా? పదిహేను రోజులుంచినా, ఇరవై రోజులుంచినా ఒక నెల అద్దె పూర్తిగా ఇస్తున్నాడు అంతే' అన్నాడు.

ఏది ఏమైనా ఈసారి నువ్వు నీ కొనుగోళ్లు మాత్రమే చూసుకో.. వేరే ఎవరివీ కలిపి తేవద్దు. తెచ్చినా మన అడితీలో దాచవద్దు అని ప్రసాద్‌ను హెచ్చరించాను. మధ్యమధ్యలో నేను వెళ్లి అక్కడ కూర్చుంటూనే వున్నాను. ఏ అర్ధరాత్రి తీసుకొచ్చి పెట్టారో తెలియదు. ఆ దుంగల్ని తెచ్చి తాటి వాసాల మధ్య దాచారు. ప్రసాదుకు విషయం నారాయణ చెప్పే వుంటాడు. నారాయణ ఇచ్చే డబ్బుకు ప్రలోభపడ్డాడు. అదేం పెద్ద తప్పు కాదనుకున్నాడు. ఇబ్బంది కూడా వస్తుందని ఊహించలేకపోయాడు. ఈ మారుమూల వున్న ఊళ్లో దాచిన ఎర్ర చందనాన్ని గురించి ఎవరికీ అనుమానం రాదని నారాయణ చెప్పిన మాటల్ని నిజమేనని భ్రమపడ్డాడు. విషయాన్ని పోలీసులు పసికట్టారు. వచ్చి తనిఖీ చేశారు. ఎర్ర చందనపు కలప బయటపడింది. నరసింహ సామిల్‌లో ఎర్రచందనపు దుంగల్ని అక్రమంగా దాచి వుంచారు. సామిల్ ఆసామి ప్రసాదును కస్టడీలోకి తీసుకున్నాము.. ఎర్రచందనాన్ని స్వాధీనం చేసుకున్నామని ప్రకటించారు. పెద్దపెద్ద స్మగ్లర్స్ ఎక్కణ్ణుంచో తరలించుకు వస్తారు. నారాయణ లాంటి చిన్నచిన్న బ్రోకర్లను వాటిని తరలించటానికి ఏర్పాటు చేసుకుంటారు. వాళ్లేమో ప్రసాద్ లాంటి వాళ్లను లోబరుచుకుని తమ పని పూర్తి చేసుకుంటారు." అన్నారు మాస్టారు బాధగా.

"చెరుకుపల్లి రేపల్లె వెళ్లే దారిలో వుంటుంది. పెద్ద పట్టణం కాదుకాని చుట్టుపక్కల పాలేల వాళ్లు ఏ వస్తువు కొనాలన్నా చెరుకు పల్లే వస్తారు. వైద్య సదుపాయం కూడా అందుబాటులోనే వున్నది. కాని మరీ అంత జనసమ్మర్దంగా వుండదు. తొందరగా ఎవరి దృష్టి పడదని నారాయణ భావించాడు. అందుకే నారాయణ తెలివిగా పొన్నూరు, చెరుకు పల్లి కలప అడితీలను వాడుకుని వుంటాడు మాస్టారు. నేరం ఎంతకాలం దాగుతుంది? పోలీసులు ఇలాంటి వారిని ఒక కంట కనిపెడుతూనే వుంటారుగా".

"అవును అలాగే జరిగింది. ప్రస్తుతానికి నారాయణ నేరస్తుడిగా లేడు. వేటగాడి ఉచ్చులో లేడి పిల్ల చిక్కుకున్నట్లుగా ప్రసాద్ చిక్కుకుపోయాడు. ప్రసాద్ వాళ్లమ్మ అయితే పూర్తిగా కూలబడిపోయింది. ఈ మధ్య మైల్డ్‌గా స్ట్రోక్ వచ్చింది. మందులు వాడుతున్నాం. ఇన్నాళ్లు పెళ్లి చేసుకోరా అంటే 'కొద్దిరోజులు పోనివ్వండి నాన్నా. నన్ను కొంచెం బిజినెస్‌లో కుదుట పడనివ్వండి. ఈ రోజుల్లో పెళ్లి కొడుకులందరికీ ముప్పైలు దాటుతున్నాయి. మీరు కూడా తొందరపెట్టవద్దు' అనేవాడు. ఇప్పుడేమో నేరస్థుడిగా ముద్రపడింది. కేసు జరుగుతూనే వున్నది. పోలీస్ స్టేషన్ చుట్టూ, కోర్టు చుట్టూ తిరుగుతున్నాడు. ఇప్పటివరకు ఆ నారాయణ జాడలేదు. పోలీసులు రెయిడ్ చేసినప్పుడు పొన్నూరులో ఏం దొరకలేదు. ఇక్కడే పదిపన్నెండు ఎర్రచందనం దుంగలు దొరికాయి. దురదృష్టం కాకపోతే ఏంటిది? ఇంతలో ప్రసాదు ఫోన్ చేశాడు. "నేను రావుగారి ఇంటి ముందున్నాను. మీరు బయటికొచ్చేయ్యండి నాన్నా అంటూ".

"మీరెళ్లకండి మాస్టారూ! ప్రసాద్‌నే లోపలికి రమ్మంటాను. పది నిమిషాలు కూర్చుని వెడతాడు." అంటూ అతణ్నే లోపలికి రప్పించారు రావు. ప్రసాద్ వస్తూనే రావుకి నమస్కరించాడు. "మీరు మా నాన్నగారికి ప్రియశిష్యులనుకుంటాను. తరచూ కొంతమంది స్టూడెంట్స్‌ను గురించి జ్ఞాపకం చేసుకుంటూ వుంటారు."

"అది నా అదృష్టం ప్రసాదూ, మాస్టారంటే నాకూ, మా అక్కకూ కూడా చాలా గౌరవం, అభిమానం, మేం దాన్ని ఎడ్మిరేషన్ అనుకుంటాం. మేమేకాదు. ఎంతో మంది మీ నాన్నగార్ని ఎంత అభిమానిస్తారో నీకు తెలియదు."

"సరే నీ సంగతేంటి? నీ విషయాలు విని చాలా బాధపడ్డాను. తెలియని వ్యక్తులతో పరిచయం, మోసంతో కూడిన స్నేహానికి నువ్వు బలైపోయావు. ఈ విషయమంతా నాన్నగారు వివరంగా చెప్పారు."

"నాన్నావాళ్లు మరీ భయపడుతున్నారు, నాకేమవుతుందోనని తెగ బెంగ పెట్టేసుకుంటున్నారు. అంత సీనేం లేదు. రెండు రోజుల క్రితం నారాయణ ఫోను చేశాడు. అంతా తను చూసుకుంటానన్నాడు. పోలీసులతో కూడా తనే మాట్లాడతానన్నాడు. కేసేమీ లేకుండా బయటపడొచ్చు అని చెప్తున్నాడు. పెద్దపెద్ద కోటీశ్వరులే ఎన్నోరకాల స్మగ్లింగ్‌లు చేస్తారు. మనమేం చేశాం? ఆ కర్ర దుంగల్ని మనమేం దొంగతనంగా ఎక్కడి నుంచో కొట్టుకురాలేదు. నాలుగు రోజులు దాచమంటే దాచాం. ప్రపంచంలో ఎందరో చేసే పెద్దపెద్ద మోసాలలో ఇది ఎన్నో వంతు. ఇదేం భయంకరమైన నేరం కాదు' అని నారాయణ గట్టిగా చెప్తున్నాడు. నాగ్గూడా నారాయణ మాటలు నిజమేననిపిస్తున్నాయి." అని వాదించాడు ప్రసాద్. నారాయణ ఉచ్చులో ప్రసాద్ ఇంకా ఇరుక్కోబోతున్నాడని రావుకి అర్థమవుతోంది.

"నువ్వు చాలా పొరపాటు పడుతున్నావు ప్రసాద్! మీరు చేసిన పని పెద్ద నేరమేం కాదని అనుకుంటున్నారు. అది చాలా పెద్ద తప్పు. వాళ్లు చేసే మోసాలకూ, అక్రమాలకూ నిన్నొక పావులాగా వాడుకోవాలనుకుంటున్నారు. ఒకసారి అనుమానం వచ్చిన తర్వాత నీ మీద, నీ కదలికల మీద ఎప్పుడూ నిఘా వుంటుంది. సమాజం కూడా నిన్ను దోషిగానే చూస్తుంది. పెళ్లి కావాల్సిన వాడివి. నిన్ను చేసుకోవటానికి ఏ అమ్మాయి ముందుకొస్తుంది. అన్యాయంగా కేసులో ఇరికించారు. అతను చాలా నిజాయితీపరుడని భావించటానికి ఇది సినిమా కాదు. సమాజాన్ని గురించి నువ్వు పట్టించుకోకపోయినా నిన్ను ఈ సమాజం వదిలి పెట్టదు. మీనాన్నగారికి ఒక్కసారిగా ఇంత అనారోగ్యం ఎందుకు వచ్చిందో గ్రహించు. విశ్రాంతి తీసుకుంటూ ప్రశాంతంగా గడపాల్సిన సమయంలో నువ్వు చాలా చాలా పెద్ద సమస్య తెచ్చిపెట్టావు. భర్తాపిల్లలే సర్వస్వంగా బతికే మీ అమ్మగార్ని గురించి ఆలోచించు. నిన్ను అరెస్టు చేశారంటే ఆమె ఎంత కుంగి పోయిందో తెలుసుకో. ప్రజల మధ్య పలుచనైపోయామన్న బాధ నీ తల్లిదండ్రులకెక్కువగా వుంటుంది. ఆరోగ్యరీత్యా ఇంకా ఏ అనర్థమైనా జరిగితే మీ అమ్మనాన్నల్ని ఎలా కాపాడుగోలవు?".

"మీరు కూడా ఏమిటి సార్! చాలా ఎక్కువ ఆలోచిస్తున్నారు! చిన్న విషయాన్ని పెద్దగా ఊహిస్తున్నారు."

"ప్రసాద్! రావు చెప్పేది వాస్తవమే, నువ్వే గ్రహించలేక పోతున్నావు, నీ బుద్ధి మరీ బండ బారిపోతున్నది.

"తేలిగ్గా డబ్బు వస్తుంటే కాదనుకోవటం తెలివితక్కువ అని నిన్ను నీవు సమర్థించుకుంటున్నావు. డబ్బు సంపాదిస్తే ఎవడేం ఎదురు మాట్లాడడు అనే ఆలోచనలో వున్నావు. ప్రసాద్ నిజంగా నీ కాళ్లను రొచ్చులో పెట్టావు. ఆ రొచ్చు కడుక్కోవటానికి ప్రయత్నించు. కడుక్కోకుండా ఇంట్లోకి వస్తే ఇంట్లో వాళ్లందరికీ ఆ బురదనంటిస్తావు. ఒకసారి కుటుంబాన్ని గురించి ఆలోచించు. నీ చెల్లెల్ని ఆమె అత్తవారింట్లో చిన్నచూపు చూసేటట్లుగా చెయ్యకు తన బావమరిది ఫలానా అంటే మీ బావగారు ఎలా ఫీలవుతారు ఆలోచించు. మనవి విచ్చలవిడి కుటుంబాలు కావు. నేరచరిత్ర కలవి కావు. మనపరువు గురించి మర్చిపోకూడదు. మంచిపేరు తెచ్చుకోవటం, దాన్ని నిలుపుకోగలగడం చాలా అవసరం. చెడ్డవాడిగా ముద్రపడి అవహేళనలకు గురికావద్దు. పొరపాటో, గ్రహపాటో జరిగిందేదో జరిగిపోయింది. ఇకదాన్ని వదిలేయ్, నిన్ను నా తమ్ముడిగా భావించి ఇదంతా చెప్పాను. నాన్నగారి మాట విను."

"వెర్రి వెయ్యి విధాల వేస్తుంది అంటారు. ఉన్నట్టుండి ఎర్రచందనం వాడకం పట్ల జనానికి మోజు పెరిగిపోయింది. అది అందంగా, నాజుగ్గా వుండే కలప కాబట్టి దాంతో ఏవస్తువు తయారు చేసినా కళాత్మకంగా వుంటుంది. ఆడంబరంగా కన్పిస్తుంది. అదేకాకుండా ఔషదగుణాల్ని కూడా కలిగి వుందని చెప్తున్నారు. ఈ కారణాలవలన ఆ చెట్లకు మరీ గిరాకీ పెరిగిపోయింది." అన్నారు నరసింహాగారు.

"అవును మాస్టారు, మీరు చెప్పింది అక్షరాలా సత్యం. డబ్బున్న వాళ్లు ఎర్రచందనపు వస్తువులను వాడటం స్టేటస్ సింబల్‌గా

భావిస్తున్నారు. ఇతరదేశాల్లో కూడా దీని వాడకం బాగా పెరిగింది. మనకొండల్లో అడవుల్లో పెరిగిన చెట్లను రహస్యంగా కొట్టుకుని తరలించుకుపోతున్నారు. ఈ అక్రమ రవాణాలో బలయ్యేది కలపకొట్టే కూలీలు, చెట్లకు కాపలాకాసే అటవీ శాఖాధికారులు. అటుకూలీలు కానీ, ఇటు అధికారులు కాని మరణిస్తే వారి కుటుంబాలు వీధిన పడుతున్నాయి. భార్యాపిల్లలు అనాథలవుతున్నారు. ఆ ఇంట్లో వున్నవృద్ధులు జీవన్మృతులవుతున్నారు. పనులు చేయించుకునే స్మగ్లర్లు పరదా చాటు నెక్కడమంటారు. మధ్యలో ఎన్నో హర్డిల్స్ దాటుకుంటూ ప్రసాదు లాంటి అమాయకులను కూడా వాడుకుంటున్నారు. సాధారణ పరిస్థితులలో అయితే చెట్లు కోతకురాగానే అటవీ శాఖాధికారులు చెట్లను కొట్టించి ప్రభుత్వం తరపున వేలం వేయిస్తారు. దానిద్వారా ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. కాని అక్రమ రవాణా ద్వారా ఎర్రచందనానికి మార్కెట్లో నిర్ణీతమైన రేటు అంటూ లేకుండా పోతున్నది. న్యాయమైన రేటు ఇచ్చి కొనే వ్యాపారస్తులు కరువైపోతున్నారు. ఇలాంటి అక్రమరవాణాలో సూదిమొనంత భాగాన్ని నీకు పంచుతున్నారు. అవునా! ప్రసాద్?

"నాన్న గారికంటే ఎక్కువ ఆలోచిస్తున్నారు సార్ మీరు. నాకేం చెప్పాలో అర్థంకావటం లేదు."

మా అందరి ఆవేదనను అర్థంచేసుకునే శక్తి నీకున్నది ప్రసాద్. నీదారి మార్చుకో, ఒకటి రెండు తప్పటడుగులతో జీవితాంతం కుంటి నడక వుండకూడదు. కుటుంబపరంగా, మన రాష్ట్రపరంగా నీవంతు సహకారాన్ని, బాధ్యతను పంచుకోవాలి. విష్‌యూ గుడ్‌లక్ ప్రసాద్. చాలా సేపు మాట్లాడాను. ఏమైనా ఇబ్బందిపెట్టానేమో! "చాలా ఓపిగ్గా ప్రసాద్‌తో చర్చించావు. బాధ్యతను గుర్తుచేశావురావ్, థాంక్‌యూ," "అలా అనవద్దు మాస్టారు! నాకు థాంక్స్ చెప్పొద్దు. మన ప్రసాద్ మంచి దారినే నడుస్తాడనీ ఆశిద్దాం".

తండ్రీ కొడుకులిద్దరూ సెలవుతీసుకుని వెళ్లిపోయారు.కొన్నిరోజులకు నరసింహం మాస్టారి దగ్గర నుండి రావ్‌కు పెద్ద ఉత్తరమే వచ్చింది.

"తనకూ తన భార్యకూ ఆరోగ్యం ప్రస్తుతం బాగానే మెరుగుపడింది. తల్లిదండ్రులిద్దరి ఆరోగ్యం పట్ల ప్రసాదు బాగా శ్రద్ధ తీసుకుంటున్నాడు. ప్రసాదులు బాగా మార్పు కనపడుతున్నది.లోకల్ డి ఎస్‌పి గారితో మాట్లాడి ఆయన సహకారంతో కేసునుండి బయటపడ్డాడు. ఇప్పుడునారాయణ లాంటి వాళ్ల మాటలు పట్టించుకోవటం లేదు. డబ్బు వ్యామోహము లేదు. జాగ్రత్తగా, నిజాయితీగానే కలప వ్యాపారం చేసుకుంటున్నాడు. రావ్! నీకు మరొకసారి ధన్యవాదాలు చెప్తున్నాను. నేనునీకు చిన్ననాటి గురువునైతే నీకు నాకొడుక్కు ఈనాడు గురువై హితబోధచేశావు" అంటూ వ్రాశారు.

మరొక్కమాట ఇంకెప్పుడూ 'నరసింహ సామిల్‌లో గడ్డి తినే వాళ్లేవరూ వుండబోరు.

విహారం

అతిపెద్ద నదీ ద్వీపం





అవనిలోనే అతిపెద్ద నదీ ద్వీపం మన భారతదేశంలోనే ఉంది. దీని పేరు మజూలి ద్వీపం. అస్సాంలోని బ్రహ్మపుత్ర నదిలో ఉన్న ఈ ద్వీపాన్ని ఇప్పుడు ఒక జిల్లాగా ప్రకటించారు. దక్షిణాన ఖేర్కుషియా క్జుటి ప్రాంతంలో బ్రహ్మపుత్ర నదితో.. ఉత్తర దిశ నుంచి వచ్చిన సుబాన్‌సిరి నది కలిసే పాయలో ఈ మజూలి ద్వీపం ఏర్పడింది.

జోర్హాట్ నగరం నుంచి పడవల ద్వారా పయనించి ఈ ద్వీపానికి చేరుకోవచ్చు. ఇది గువహటి నగరం నుంచి తూర్పు దిశలో 300–400 కిలోమీటర్ల దూరంలో ఉంది. బ్రహ్మపుత్ర, దాని ఉపనదులు ముఖ్యంగా లోహిత నది ప్రవాహ గతి ఈ ద్వీపం ఏర్పడటానికి ప్రధాన కారణం.

రెండు నదుల మధ్య సన్నగా, పొడవుగా ఉండే భూభాగమే మజూలి ద్వీపం. బ్రహ్మపుత్ర ఉత్తర దిశలో ప్రవహిస్తుంటుంది. బుర్హిదినింగ్ దక్షిణాన ప్రవహిస్తూంటుంది. ఈ రెండు నదులు లాకు వద్ద కలుస్తాయి. ప్రకృతి వైపరీత్యాలే ఈ నదీ ద్వీపం ఏర్పడానికి భౌగోళిక మార్పులు చేశాయి. 1661 – 1696 సంవత్సరాలలో తరచుగా సంభవించిన భూకంపాల కారణంగా ఏర్పడిన భౌగోళిక మార్పు ఒకటైతే, 1750లో వరద విపత్తు 15 రోజుల పాటు ఏకధాటిగా కుంభవృష్టి వర్షం వలన కూడా ఈ భౌగోళిక స్థితిలో స్థిరత్వం వచ్చింది. ఇదే విషయం చారిత్రక గ్రంథాలు, జానపద కథల్లోను చెప్పబడింది. ఇక్కడ వల్లనే బ్రహ్మపుత్ర రెండు నదీ పాయలుగా విడిపోతుంది. ఈ విధంగా మనకు కనిపించే మజూలి ద్వీపం ఏర్పడింది. బుర్హిదినింగ్ తూర్పు దిశగా 190 కిలోమీటర్లు ప్రవహించి నదీ సంగమంలో కలిసి దక్షిణాన బుర్హిక్జుటిగా మారింది. ఉత్తర నదీపాయ గతంలో బ్రహ్మపుత్రగా ప్రవహించేది. దాన్ని లుయిట్ క్జుటి అనేవారు. కాలగమనంలో నీటి ప్రవాహం తగ్గిపోయింది. ప్రస్తుతం దీన్ని ఖేర్‌ఖుషియా క్జుటిగా పిలుస్తున్నారు. ఈ శతాబ్ద ప్రారంభ దశలో దీని విస్తీర్ణం 1,250 చదరపు కిలోమీటర్లు ఉండేది. నదీతీర కోతకు గురై 2014 నాటికి దీని విస్తీర్ణం 352 చదరపు కిలోమీటర్లకు కుంచించుకుపోయింది. ఇక్కడి స్థానికులు మిసింగ్, అస్సామి భాషల్లో మాట్లాడతారు. దీన్ని యోగినితంత్రగా గుర్తించింది మాత్రం సుతియా రాజు రత్నధజపాల్. ఆయన తన రాజధాని రతన్‌పూర్‌లో దీన్ని గుర్తించారు. రతన్‌పూర్ ఇపుడు కమలాబరికి తూర్పున ఉంది. 16వ శతాబ్దం నుంచి మజూలి అస్సాం సాంస్కృతిక వారసత్వాన్ని పుణికి పుచ్చుకుందని, ఈ ప్రాంతాన్ని సందర్శించిన శ్రీమంత శంకరదేవ్ రాసిన పుస్తకంలో ఉంది. శంకర దేవ మధ్య యుగానికి చెందినవాడు. ఆ కాలంలో వీటిని ద్వీపము మీద ఏర్పడిన రాజ్యాలుగా పిలిచేవారు.

144 గ్రామాలు

ఈ ద్వీపంలో 144 గ్రామాలున్నాయి. 1 లక్షా 50 వేల మంది జనాభా ఉన్నారు. అక్కడ తలసరి జనసాంద్రత 300గా ఉంది. బయట ప్రపంచంలో అడుగు పెట్టాలంటే, అక్కడ నడిచే బోట్లను ఆశ్రయించాల్సిందే. ఇవి రోజుకు ఆరుసార్లు నదిలో తిరుగుతూ ఉంటాయి. ఇక్కడ ప్రజలంతా కలిసి మెలిసి ఉంటారు. గ్రామాలన్నింటికి ఆయువుపట్టుగా ఉండే నామ్‌గర్ అనే గ్రామంలో స్థానికులంతా ఒకచోటకు గుమిగూడి ప్రార్థన, గీతాలాపనలు చేస్తుంటారు. ఇక్కడ వ్యవసాయం ప్రధాన వృత్తిగా ఉంది. పాడిపరిశ్రమ దీనికి తోడవడంతో చాలా తక్కువ ఖర్చుతో వ్యవసాయ సాగు జరిగేది. ఇందులో వందల రకాల పంటలు పండించేవారు. క్రిమి సంహారక మందులు లేదా కృత్రిమ రసాయనిక ఎరువులను ఉపయోగించకుండానే సాంప్రదాయక వ్యవసాయక పద్ధతులననుసరిస్తున్నారు. చేనేత అనేది అక్కడి గ్రామాల్లో ప్రధాన వృత్తిగా ఉంది. పర్యాటక ప్రాంతం కూడా. అతి వ్యాపారాత్మక వైఖరిగా కాకుండా అక్కడ ప్రజలు సాధారణ జీవితాన్ని గడుపుతుంటారు. అదే విధంగా పత్తి విరివిగా లభించడం వలన అక్కడ గ్రామీణులు ఎక్కువగా కుట్లు, అల్లికలు, వివిధ రకాలైన చేనేత అల్లికలు వంటివి చేస్తుంటారు.

– పద్మా సతీష్

కొత్త కోణంలో 'దళితుల చరిత్ర'

"సింధు నాగరికతలోని వ్యవసాయ సంస్కృతి బుగ్వేద సంస్కృతికంటే పురాతనమైనది. అప్పటికే వారు వ్యవసాయాన్ని చేస్తున్నారు. భూమిని గుర్తించారు. సింధు సంస్కృతి రుగ్వేద సంస్కృతి కంటే చాలా ఉన్నతమైనది కావటం వల్ల ఆర్యులు ద్వేషపడ్డారు. భారత ఉప ఖండ సంస్కృతికి నిర్మాతలు మాతృస్వామిక వ్యవస్థకు సంబంధించిన వారైన సింధు నాగరికత వాసులు ఈనాటి దళితులే" ఇది కత్తి పద్మారావు ప్రతిపాదన. దళితుల చరిత్రను ఆయన కొత్త కోణంలో పరిశీలన చేస్తున్నారు. "దళితుల చరిత్ర" 5వ భాగంలో ఆయన అనేక కొత్త విషయాలను ప్రతిపాదిస్తున్నారు. "మాల జాతులే ఈ దేశ నిర్మాతలు, యానాదులు,ఎరుకలు,

పుస్తకం పేరు:
దళితలు చరిత్ర
డా॥ కత్తిపద్మారావు
ప్రచురణ: లోకాయత ప్రచురణలు, పొన్నూరు
మొదటి ముద్రణ: 2016
వెల: 250
పేజీలు : 500

కోయ,మాల మాదిగ వంటి కులాల్లో మూలవాసుల రూపురేఖలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అని పద్మారావు పరిశీలన.

"బ్రహ్మణులు చేసిన ప్రతి కృత్యం కూడా అది మూల వాసుల సంస్కృతిని అణగదొక్కటానికి, భయపెట్టే తమకు అనుకూలంగా మార్పు చేసుకోవటం జరిగింది. పిల్లలు పుట్టటానికి, పెండ్లికి, మరణానికి, కర్మకాండుల రూపొందించటం ద్వారా అవి పూర్తిగా పురుషుల చేత నిర్వహించడటం ద్వారా మాతృస్వామిక సంస్కృతిని దెబ్బతీసే ప్రయత్నం జరిగింది. భారతీయ మూల వాసుల సంస్కృతిని భాషను రక్షించుకోవటం ఇప్పటికే పెద్ద యుద్ధంగానే సాగుతుంది". ఇటువంటి ఎన్నో కొత్త విషయాలను చారిత్రకాంశాలను కత్తి పద్మారావు మనకందించారు.

వేదాలు, భారత, రామయణాల్లో పాత్రల చుట్టూ పెద్దపెద్ద కలల్లి హిందూ పునరుద్ధరణ వేద శక్తులు చరిత్రను వక్రీకరించటానికి ప్రయత్నం చేస్తున్నారు. అన్నీ వేదాల్లోనే ఉన్నాయనే ప్రచారాన్ని ముమ్మరంగా సాగిస్తున్నారు. అందుకనే చరిత్రను పున: నిర్మాణం చేయాల్సిన అవసరం ఉందని అణగదొక్కబడిన జాతులు ఆ కర్తవ్యాన్ని స్వీకరించాలని ఈ పుస్తకం తెలుపుతుంది.

- భవిష్య

స్వీకారాలు

వలి శతకాక్షరి
రచయిత : షేక్ మస్తాన్ వలి
వెల : 85
పేజీలు : 61
ప్రతులకు: గుడిమెట్ల, చందర్లపాడు కృష్ణాజిల్లా, 9848357673

రాయలసీమ రాష్ట్రం ఒక డిమాండ్
రచయిత: భూమన్
వెల:50
పేజీలు:46
ప్రతులకు:విశాలాంధ్ర ప్రజాశక్తి,నవోదయ బుక్ హౌస్ అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు

కథలకు ఆహ్వానం

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం స్నేహ కథలకు ఆహ్వానం పలుకుతోంది. మంచి కథలను ఎంపిక చేసి ప్రచురిస్తాం. కథ సమకాలీన పరిణామాలు, పరిస్థితుల నేపథ్యంగా వుండాలి. ప్రపంచీకరణ నేపథ్యంలో వివిధ రంగాల్లో చోటు చేసుకున్న, చేసుకుంటున్న విపరిణామాలను కథాంశంగా తీసుకోవచ్చు. ప్రగతిశీల చైతన్యాన్ని, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించే కథలకు ప్రాధాన్యత. మూఢనమ్మకాలు పెంచేవిగా, ఏ సామాజిక తరగతిని ప్రత్యేకంగా నొప్పించేదిగా వుండకూడదు. మాండలికాలు ఉపయోగించినా కథన శైలి అందరికీ బోధ పడేలా వుండాలి. నవ్యత, వైవిధ్యం కలిగిన కథలకు ప్రత్యేక ఆహ్వానం.

నిబంధనలు

కథ నిడివి ప్రింటులో మూడు ఎ4 కాగితాల్లో వుండాలి. చేతిరాతలో అయితే 8 నుంచి 10 కాగితాల్లో వుండాలి. ప్రింటయినా, చేతిరాతైనా కాగితానికి ఒకవైపు మాత్రమే వుండేలా... జిరాక్స్ ప్రతిని పంపాలి. కథలను తిప్పి పంపడం వుండదు. పేరు, పూర్తి చిరునామా, ఫోన్ నెంబరు తప్పక రాయాలి. మా చిరునామా: స్నేహ, ప్రజాశక్తి దినపత్రిక, హౌస్ నెం. 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.

మెయిల్ అడ్రస్:
snehaweekly.praja@gmail.com

-ఎడిటర్

పోహా కట్‌లెట్

కావాల్సిన పదార్థాలు

అటుకులు-500 గ్రాములు
పెరుగు-200 గ్రాములు
ఆవాలు-1టేబుల్ స్పూన్
ఇంగువ-చిటికెడు
నూనె-సరిపడ
పచ్చిమిర్చి పేస్ట్-2 టేబుల్ స్పూన్లు
కొబ్బరి తురుము-1/2 కప్పు
కొత్తిమీర 1/2 కప్పు
జీలకర్ర-1టేబుల్ స్పూన్
ఉప్పు-తగినంత

తయారుచేసే విధానం

ముందుగా అటుకులను నీళ్లలో వేసి కడిగి పెరుగులో ఒక గంట సేపు నానబెట్టుకోవాలి. తర్వాత పచ్చిమిర్చిని పేస్ట్ చేసుకోవాలి. నానబెట్టిన అటుకుల మిశ్రమంలో పచ్చిమిర్చి పేస్ట్, కొత్తిమీర తరుగు, ఉప్పు వేసి బాగా కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని ఒక వెడల్పాటి పాత్రలో వేసి ఆవిరి బాగా పట్టే వరకు ఉడికించాలి. తర్వాత తీసి ముక్కలుగా కట్ చేసుకోవాలి. ఇప్పుడు ఫ్రైయింగ్ ప్యాన్ తీసుకొని కొద్దిగా నూనె వేసి వేడెక్కిన తర్వాత అందులో జీలకర్ర, ఆవాలు వేసి ఒక నిమిషం పాటు వేగనివ్వాలి. తర్వాత ముక్కలుగా కట్ చేసుకున్న అటుకుల మిశ్రమాన్ని ప్యాన్‌లో వేసి గోధుమ రంగు వచ్చే వరకు ఒక్కో ముక్కను రెండు వైపులా వేయించుకోవాలి. వేయించిన ముక్కలన్నిటినీ ఒక ప్లేట్‌లోకి తీసుకుని కొబ్బరి తురుము, కొత్తి మీర తరుగుతో గార్నిష్ చేస్తే వేడి వేడి పోహా కట్‌లెట్ రెడీ.

పనీర్ చీజ్ బాల్స్

కావాల్సిన పదార్థాలు

పనీర్-500 గ్రాములు
చీజ్-1 కప్పు
ఉల్లిపాయలు-1 కప్పు
పచ్చిమిర్చి-4
బ్రెడ్ పొడి-1/2 కప్పు
ఉడికించిన బంగాళ దుంపలు -1/2 కప్పు
కార్న్ ఫ్లోర్ -1/2 కప్పు
కారం-1/2 టీ స్పూన్
ఉప్పు-సరిపడా
నూనె -తగినంత



తయారుచేసే విధానం

ముందుగా ఒక పెద్ద బౌల్ తీసుకుని అందులో ఉల్లిపాయలు, పనీర్, చీజ్‌లను తురుముకోవాలి. తర్వాత అందులో పచ్చిమిర్చి తరుగు, ఉడికించిన బంగాళదుంపల పేస్ట్, కారం వేసి బాగా మిక్స్ చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని చిన్న చిన్న ఉండలుగా చేసి ఒక ప్లేట్‌లో పెట్టుకోవాలి. ఇప్పుడు స్టౌపై పాన్ పెట్టి నూనె వేసి వేడి చేయాలి. తర్వాత పనీర్ బాల్స్‌ని బ్రెడ్ పొడిలో పొర్లించి కాగే నూనెలో వేసి ఫ్రై చేసుకోవాలి. డీప్ ఫ్రై చేసిన తర్వాత వాటిని ఒక ప్లేట్‌లోకి తీసి టమాటా సాస్‌తో సర్వ్ చేయండి.

పొటాటో పనీర్ పకోడా

కావాల్సిన పదార్థాలు

బంగాళ దుంపలు-4 (ఉడికించి పేస్ట్‌లా చేసుకోవాలి)
పచ్చిమిర్చి- 10
పనీర్ తురుము-1/2 కప్పు
సెనగ పిండి- 150 గ్రాములు
బియ్యప్పిండి-1 టేబుల్ స్పూన్
కారం-1టేబుల్ స్పూన్
ఉప్పు-తగినంత
నూనె-సరిపడా
ధనియాల పొడి-1 టేబుల్ స్పూన్
బేకింగ్ సోడా -చిటికెడు

తయారుచేసే విధానం

పచ్చిమిర్చిని శుభ్రంగా కడిగి మిక్సీలో వేసి పేస్ట్ చేసుకోవాలి. ఒక బౌల్‌లో పచ్చిమిర్చి పేస్ట్, పనీర్ తురుము, ఉడికుంచుకున్న బంగాళ దుంప పేస్ట్ వేసి బాగా కలుపుకోవాలి. అందులో సెనగపిండి, బియ్యప్పిండి, ఉప్పు, కారం, ధనియాల పొడి, బేకింగ్ పౌడర్ జతచేసి మరోమారు కలపాలి. అవసరాన్ని బట్టి కొద్దిగా నీరు జతచేయాలి. ఇప్పుడు స్టౌపై బాణలి పెట్టి నూనె వేసి వేడెక్కిన తర్వాత సెనగపిండి మిశ్రమాన్ని పకోడీలుగా బంగారు రంగు వచ్చే వరకు వేయించాలి. తర్వాత ఒక ప్లేట్‌లోకి తీసుకుని చిల్లీ సాస్‌తో వేడి వేడి పకోడీలను అతిథులకందించండి.





రంగులు అద్దండి



ఆకులతో బొమ్మ

మనింటి ముందు రాలి పడిపోతుండే పచ్చి ఆకులు, ఎండుటాకులతో కోడి బొమ్మని ఎలా చేయొచ్చో ఇక్కడ ఇచ్చాం! దాన్ని గమనించి మీరూ తయారుచేసేయండే!

భిన్నమైనదేది



ఇక్కడ ఒక్కో వరుసలో కొన్ని బొమ్మలున్నాయి. అయితే వాటిలో ఒక భిన్నమైన బొమ్మ ఉంది. అదెక్కడుందో మీరు కనిపెట్టి సున్నా చుట్టేయండి.

గుర్తించండి

పిల్లలూ! మీకిష్టమైన కొన్ని జంతువులు వాటి పేర్లను ఇక్కడుంచాం! పక్క నున్న అక్షరాల్లో వాటి పేర్లెక్కడున్నాయో గుర్తించి పెన్నుతో మార్క్ చేయండి.

F	C	A	T	H
D	O	G	E	O
U	W	X	G	R
C	P	I	G	S
K	O	W	L	E



CAT DOG FOX DUCK PIG EGG HORSE OWL COW

అతికిద్దాం

చింటూకి ఈ మధ్య అల్లరి మరీ ఎక్కువైపోయింది. టెడ్డీబేర్ బొమ్మని కత్తిరించి అతికించకుండా వెళ్లిపోయాడు. ఇక్కడిచ్చిన బొమ్మ ఆధారంగా మీరు దాన్ని జాగ్రత్తగా అతికించేయండి.





నేర్చుకుందాం

మీకు బొమ్మలు గీయడమంటే భలే ఇష్టం కదూ. మీ కోసం పక్షి బొమ్మ ఎలా గీయాలో ఇక్కడ ఇచ్చాం. మీరూ ప్రయత్నించండి.

బొమ్మలకో గొడుగు

పిల్లలూ... బొమ్మల కోసం తయారుచేసే అలంకరణ వస్తువులతో పాటు వాటి చేతుల్లో రకరకాల చిట్టి గొడుగుల్ని మీరు షాపుల్లో చూసే ఉంటారు. మీ బొమ్మల కలెక్షన్‌లోనూ బుల్లి టెడ్డీబేర్స్, బార్బీ డాల్స్ ఉండే ఉంటాయి. మరి ఇంకెందుకు ఆలస్యం వాటి కోసం ప్రత్యేకంగా చిన్న గొడుగుల్ని ఎలా తయారు చేయాలో మేము నేర్పిస్తాం జాగ్రత్తగా నేర్చుకోండే.

తయారుచేసే విధానం

మీ వద్ద ఉన్న బొమ్మల ఎత్తుని బట్టీ వాటికి కావాల్సిన గొడుగుని తయారు చేసుకోవాలి. ముందుగా తెలుపు రంగు కన్‌స్ట్రక్షన్ పేపర్‌పై పెన్సిల్ తో ఒక వృత్తాన్ని గీసుకోవాలి. తర్వాత స్కేల్ సాయంతో ఏడు సమాన త్రికోణాలు వచ్చేలా వృత్తం మధ్య నుండి అంచుకి పెన్సిల్ మార్క్ చేయాలి. ఇప్పుడు ఒక త్రికోణాన్ని కత్తెరతో కట్ చేయాలి. మీకు నచ్చిన రంగుల స్కెచ్ పెన్సిల్/పెయింట్స్‌ని ఉపయోగించి మిగిలిన ఆరు త్రికోణాల్లో రంగులు నింపాలి. అవి పూర్తిగా ఆరిన తర్వాత కోన్ లా చుట్టి గమ్‌తో అతికించాలి. ఇప్పుడు కార్డ్‌బోర్డ్‌పై ఐదు ఇంచ్‌లుండేలా ఒక వృత్తాన్ని గీసి దాన్ని జాగ్రత్తగా కట్‌చేసి పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు ఒక బాటిల్ క్యాప్ మధ్యలో రంధ్రం చేసి ఒక గట్టి పుల్లని తీసుకుని జాగ్రత్తగా గుచ్చాలి. పుల్ల మరో చివర నుంచి స్ట్రాని దూర్చి బాటిల్ మూతపై నిలబడేలా గమ్‌తో అతికించాలి. పుల్ల పై భాగంలో కట్‌చేసి పెట్టుకున్న కార్డ్‌బోర్డ్ ముక్కని గుచ్చాలి. ఇప్పుడు ముందుగా అతికించి పెట్టుకున్న రంగు రంగుల కోన్ మధ్యలో కార్డు బోర్డ్ వృత్తం ఉండేలా గమ్‌తో అతికించాలి. ఇప్పుడు కోన్ పై భాగంలో కనిపించే పుల్లకి పూసలు లేదా మరో చిన్న బాటిల్ మూతని గుచ్చితే రంగురంగుల బొమ్మల గొడుగు రెడీ!

కావాల్సిన వస్తువులు

కన్‌స్ట్రక్షన్ పేపర్-1 (తెలుపు రంగు), కార్డ్‌బోర్డ్-1, బాటిల్ మూత-1, స్ట్రా, పెయింట్స్/ కలర్ పెన్సిల్స్- నచ్చిన రంగులు, పెయింట్ బ్రష్, పెన్సిల్ ,రూలర్, కత్తెర, టేప్, గమ్.

ఆధారాలు

అడ్డం

1. బహుమతి (3)
3. నీరు (3)
7. బొడ్డు (2)
8. కొందరు ఇది చేసి పనులు చేయించుకుంటుంటారు (3)
9. వచ్చుట (2)
13. గజిబిజిగా సాలెగూడు (4)
14. రెక్కలుండీ పాలిచ్చే క్షీరదాలు (4)
16. ఇంగ్లీషు చూపు (2)
17. ఒక వేసవి విడిది కేంద్రము (3)
18. అమెరికాలోని ఒక తెలుగు సంఘము (2)
21. సంగీత ప్రధాన చిత్రాలలో ఇది నిర్ణయించాకే పాట రాయడం మొదలు పెడతారు (3)
22 . వాసన దేనితో చూస్తాం (3)

పదవికాసం - 31

కూర్పు: రావెళ్ల

	1	2			3	4		
5				6				
7			8				9	10
		11				12		
13					14			
				15				
16			17				18	
		19				20		
	21				22			

నిలువు

2. బావి (2)
4. పూలతీగ (2)
5. ప్రతి పదేళ్లకూ భారత ప్రభుత్వము ఈ లెక్కలు సేకరిస్తుంది (6)
6. ఇది చేసిన వారికి శిక్ష తప్పుదు (3)
10. కలలు బాగా కనాలిలో బాగా లోపించింది (6)
11. మాసము కాదు అనేకం (3)
12. సంక్రాంతికి రంగవల్లులపై పెట్టేవి (3)
15. ఆంధ్రా ప్యారిస్ (3)
19. చివర లేని పగలు (2)
20. 'దెస'కు ప్రకృతి పదం (2)

సుడోకు

1				5		3		
		4	9				5	6
	5				1		2	4
	4	7		9	5	8	3	1
3		6				5		2
9	1	5	2	8		4	6	
4	2		3				8	
5	6				4	2		
		3		1				9

గతవారం జవాబులు

5	6	7	2	8	3	9	4	1
8	1	2	5	9	4	3	6	7
9	3	4	7	1	6	5	2	8
4	7	3	8	6	5	2	1	9
2	5	6	9	7	1	4	8	3
1	8	9	3	4	2	7	5	6
6	9	1	4	2	7	8	3	5
3	2	8	1	5	9	6	7	4
7	4	5	6	3	8	1	9	2

1 అం		2 ము	3 షా		4 శ్రీ	శ్రీ		5 ని
6 కె	7 వృ		వ		ము		8 బీ	జం
	9 స	10 యు	నం		11 ఖ	12 లు	డు	
13 వి		వ		14 డో		జై		15 ఉ
16 నం	ది		17 రా	పి	డి		18 తా	రు
డి		19 ప		డి		20 అ		షు
	21 ప	త్రి	22 క		23 అ	త్త	24 రు	
25 గ	ద్యం		ళా		దు		26 చి	27 తి
డ్డి		28 వా	యి		29 సు	ధ		ట్టు



అంతెత్తు దాలియాలు

అంతెత్తు అద్భుత ఆకృతుల్ని దాలియా పూలతో నిలబెట్టేశారు. కోర్సో జుండెర్ట్ పేరిట జరిపే ఈ పూల ప్రదర్శన స్థానికంగా ఉన్న పూల రైతులు సంతోషంగా వేడుక చేసుకోడానికే. ప్రఖ్యాత చిత్రకారుడు విన్సెంట్ వాన్ గోగ్ జన్మస్థలమైన నెదర్లాండ్స్‌లోని జుండెర్ట్‌లో ప్రతి ఏటా ఈ పూల ఉత్సవాన్ని ఘనంగా చేసుకుంటారు. ప్రతిదీ 66 అడుగుల పొడవు, 33 అడుగుల ఎత్తుండే ఈ ప్రభ ఒక్కోదాన్ని నిర్మించడానికి సుమారు 5 లక్షల దాలియా పూలు పడతాయి. వీటిని చూడ్డానికి 75 వేల మంది సందర్శకులు జుండెర్ట్‌కు చేరుకుంటారు. ప్రపంచంలో అతి పెద్ద పుష్పాకృతుల ప్రదర్శనగా దీనికి పేరుంది. 1936 నుంచి ప్రతి ఏటా సెప్టెంబర్ తొలి ఆదివారం జరుగుతుంది. ఈసారి పోటీల్లో టిగ్గెలార్ కుగ్రామానికి చెందిన 'డేంజెరస్ ట్రాన్స్‌పోర్టేషన్' తొలి స్థానంలో నిలిచింది.





VIP Vidhatha Institute of Personality Developmnet

Contact for Corporate Programs
Cell: 98481 90302

33ఏళ్ళ అనుభవంతో వ్యక్తిత్వ వికాసం
రియల్ ఎస్టేట్, ఇన్సూరెన్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్‌కు
నెట్‌వర్క్ మార్కెటింగ్ ప్రతినిధులకు షాపింగ్‌మాల్స్,
హాస్పటల్ సిబ్బందికి స్కూల్స్, ఇంజనీరింగ్, మేనేజమెంట్
కాలేజిలకు, ప్రత్యేక శిక్షణ కై సంప్రదించండి

6,000 పవర్ పాయింట్
ప్రదర్శనలు మా వద్ద రెడిగా కలవు

websites : www.krantikar.blogspot.in
www.vidhatha.in, www.kranthikar.com
www,facebook.com/krantikar ye
Hyderabad : 93 93 11 2021, Vizag :9440 633 610

డా॥ క్రాంతికార్
(Psychologist , Hypno-Therapist & HRD trainer)
(PhD),MSc(Psychology),MSc(Counseling Psychology), MSc(App Psy), MA (Child Care),BSc(Psy),BA(Psy),BNat (Naturopathy & Yoga), DY(Yoga),YCC(Yoga),MBA(HR),MA(PPM), MA(S), MA(PPS), MLM,MA(GT), MA(Phy), BCom,HDSE & More
ప్రముఖ సైకాలజిస్ట్

33 ఏళ్ళ అనుభవంతో...

క్రాంతికార్

(PhD),MSc (Psychology),MSc (Counseling Psychology),
MSc(App Psy),MA (Child Care), BSc(Psy), BA(Psy),BNat (Naturopathy & Yoga),
DY(Yoga),YCC(Yoga), MBA(HR),MA(PPM), MA(S), MA(PPS),MLM,MA(GT),
MA(Phy), BCom,HDSE & More

COUNSELING PSYCHOLOGIST

నత్తి, భయం, ఏకాగ్రత లేమి, మతిమరుపు
డిప్రెషన్, యాంగ్జయిటీ, ఆందోళన, టెన్షన్,
మానసిక ఒత్తిడి, ప్రేమ సమస్యలు, విద్యార్థుల
సమస్యలు, దాంపత్య-సెక్స్ సమస్యలు

Contact for Corporate Programs
Cell: 98481 90302

www.krantikar.com, www.vidhatha.in

Check List			
Book Number	KNSR028138	Date	03/09/22
Front Cover	yes	Back Cover	yes
Blank Pages	NO		
Missing Pages	NO		
Prepared By	Mounika	Cutting By	Mouni
Scanned By	Shameera	Pages	29